సాయి సూర్య తెలుగు దిన పత్రిక www.saisuryaa.com
శనివారం - 10 - మే - 2025

## అలర్ట్.. ఆ లింక్స్ ఓపెన్ చేస్తే చిక్కులే.. సైబర్ దాడికి పాక్ ప్లాన్.. 'డాన్స్ ఆఫ్ ది హిల్లరీ' వైరస్‌తో ఎటాక్?

మొదటి పేజి తరువాయి

ప్లాట్‌ఫామ్‌ల ద్వారా భారత పౌరులను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడిని ప్లాన్ చేస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సైబర్ దాడులకు గురికావొద్దని ప్రజలను భారత్ హెచ్చరిస్తోంది. అనుమానాస్పద ఫైల్‌లు లేదా లింక్‌లను ఓపెన్ చేయొద్దంటూ ప్రజలను హెచ్చరిస్తూ నిఘా సంస్థలు హై అలర్ట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇస్లామాబాద్ వంటి ప్రధాన నగరాలతో సహా పాకిస్తాన్ అంతటా ఉగ్రవాద కేంద్రాలపై భారత సాయుధ దళాలు దాడులను కొనసాగిస్తుండగా, పొరుగు దేశం ప్రతీకారంగా సైబర్ యుద్ధానికి దిగినట్లు తెలుస్తోంది. అధికారుల ప్రకారం, సున్నితమైన సమాచారం, ఆర్థిక డేటా లక్ష్యంగా పలు మాల్వేర్లను వ్యాప్తి చేసేందుకు పాకిస్తాన్ వాట్సాప్, ఇమెయిల్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగిస్తోందని చెబుతున్నారు. "డాన్స్ ఆఫ్ ది హిల్లరీ" వైరస్‌గా గుర్తించిన మాల్వేర్ వీడియో ఫైల్స్ లేదా డాక్యుమెంట్స్ రూపంలో పంపిణీ అవుతోంది. ఒకసారి యాక్టివేట్ అయితే ఈ వైరస్, మొబైల్ లేదా కంప్యూటర్‌లను తీవ్రంగా దెబ్బతీస్తుందని, బ్యాంక్ ఆధారాలతో సహా రహస్య డేటాను హ్యాకర్లు యాక్సెస్ చేసే అవకాశం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వైరస్ అనుమానాస్పద లింక్‌లు లేదా అటాచ్‌మెంట్‌ల ద్వారా వస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా .%వఇవ% తో వచ్చే ఫైల్స్ ఓపెన్ చేయొద్దని చెబుతున్నారు. అలాగే, అపరిచితుల నుంచి వచ్చే ఫైల్స్, తెలియని లింక్స్ క్లిక్ చేయడం లేదా ఓపెన్ చేయడం మానుకోవాలని అధికారులు వినియోగదారులను కోరుతున్నారు. భారత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద లింక్స్ ఓపెన్ చేయొద్దంటూ అధికారులకు సూచించారు. మరోవైపు, పాకిస్తాన్ సైనిక దురాక్రమణకు భారత్ తీవ్రంగా స్పందించింది. భారత సాయుధ దళాలు అనేక ఉగ్రవాద శిబిరాలను విజయవంతంగా ధ్వంసం చేశాయి. డ్రోన్లు, క్షిపణులను అడ్డుకున్నాయి. పాకిస్తాన్ నగరాల్లో భారీ నష్టాన్ని కలిగించాయి. ఈ ప్రభావంతో విలవిలలాడుతున్న పాకిస్తాన్ తమ దేశంలో లాక్‌డౌన్ విధించినట్లు సమాచారం.

## సరిహద్దుల్లో పాక్ కాల్పులు.. తెలుగు జవాన్ వీర మరణం

న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌ను సహించలేని దాయాది పాకిస్థాన్ వక్రబుద్ధితో భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో తెలుగు జవాన్ వీర మరణం పొందారు. మృతిచెందిన జవాన్‌ను మురళీ నాయక్‌గా గుర్తించారు. వీర జవాన్‌ది ఏపీలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండల పరిధిలోని కల్లి తండా. గురువారం రాత్రి సరిహద్దు వెంబడి పాక్ కాల్పులు జరపగా మన సైన్యం కూడా దీటుగానే బదులిచ్చింది. ఈ ఎదురుకాల్పుల్లో మురళీ నాయక్ చనిపోయినట్లు సమాచారం. శనివారం స్వగ్రామానికి వీర జవాన్ పార్థివ దేహం రానున్నట్లు తెలుస్తోంది. కాగా, వీర జవాన్ మురళీ నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగాడు. సోమందేపల్లిలోని విజ్ఞాన్ స్కూల్‌లో చదివాడు. జవాన్ మృతితో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో స్వగ్రామం కల్లితండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బాంబులతో పేల్చేస్తాం... ఢిల్లీ క్రికెట్ స్టేడియానికి బెదిరింపు

మొదటి పేజి తరువాయి

గుర్తుతెలియని వ్యక్తుల నుంచి శుక్రవారం ఉదయం ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ)కు ఈ మేరకు ఒక ఈ-మెయిల్ అందింది. దాడులకు పాల్పడతామని, ఇందుకోసం భారత్ వ్యాప్తంగా పాకిస్థాన్‌కు విధేయులైన స్లీపర్ సెల్స్ సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించినట్లు సమాచారం. ఈ స్టేడియం ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు హోం గ్రౌండ్‌గా ఉండగా, మే 11న ఇక్కడ ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే, టోర్నమెంట్‌ను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు బీసీసీఐ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ బెదిరింపు ఈ-మెయిల్ అందిన విషయాన్ని డీడీసీఏ ఉన్నతాధికారి ఒకరు ధృవీకరించారు. టైమ్స్ ఆఫ్ ఇండియా డాట్ కామ్‌తో మాట్లాడుతూ, "అవును, ఈ ఉదయం మాకు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. దానిని వెంటనే ఢిల్లీ పోలీసులకు పంపాము. వారు ఇప్పటికే రంగంలోకి దిగి, స్టేడియాన్ని తనిఖీ చేశారు" అని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ పోలీసులు స్టేడియం వద్ద భద్రతను కట్టుదిట్టం చేసి, బెదిరింపు ఈ-మెయిల్ మూలాలపై దర్యాప్తు చేస్తున్నారు. భద్రతా వర్గాలు అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతున్నాయి. ఇదిలా ఉండగా, ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత సైన్యం చేపట్టిన చర్యలు, అలాగే ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ జరుగుతుండగా వైమానిక దాడి హెచ్చరిక (ఎయిర్ రెయిడ్ అలర్ట్) మోగడం వంటి పరిణామాల నేపథ్యంలో, జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా ఐపీఎల్ 2025ను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ, "అన్నింటికన్నా దేశ ప్రయోజనాలే అత్యంత ముఖ్యం" అని స్పష్టం చేశారు. భారత సాయుధ బలగాలకు బీసీసీఐ సంఘీభావం తెలుపుతుందని, దేశ సమగ్రత, భద్రతకు కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. టోర్నమెంట్‌లో ఇంకా 16 మ్యాచ్‌లు మిగిలి ఉండగా, భాగస్వాములు మరియు అధికారులతో పరిస్థితిని సమీక్షించిన అనంతరం సవరించిన షెడ్యూల్‌ను ప్రకటిస్తామని బీసీసీఐ వెల్లడించింది.

## త్రివిధ దళాలకు సెల్యూట్.. నా అవసరం ఏ మాత్రం ఉన్నా యుద్ధానికి వెళ్తా : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. తన అవసరం ఏ మాత్రం ఉన్నా.. యుద్ధానికి వెళ్తానని స్పష్టం చేశారు.

ఉత్తమ్ కుమార్ రెడ్డి : భారత్‌లో 24 నగరాలను టార్గెట్ చేసిన పాక్.. గురువారం రాత్రి 500 డ్రోన్లతో దాడులకు తెగబడింది. సరిహద్దు రాష్ట్రాల నగరాలే టార్గెట్‌గా దాడులు చేస్తోంది. పాక్ డ్రోన్లను గగనతలంలోనే భారత్ పేల్చేసింది. అటు సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను మరింత పెంచాలని కేంద్రం సూచించింది. అన్ని రాష్ట్రాలకు సీఎస్‌కు ప్రత్యేకమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

త్రివిధ దళాలకు సెల్యూట్.. : 'త్రివిధ దళాలకు మా సెల్యూట్. ఒక్క పౌరుడు గాయపడకుండా దాడులు చేశారు. ఏ ప్రభుత్వం ఉన్నా బుద్ధిచెప్పడం తప్పనిసరి. మన రాఫెల్ యుద్ధ విమానాలను ఎక్కడా కూల్చలేదు. పాకిస్తాన్ అబద్ధాలు చెబుతోంది. యుద్ధం మొదలైతే పాకిస్తాన్ పతనమే. పాక్ విచ్ఛిన్నమడం ఖాయం. యుద్ధంలో మూడో దేశం ఎప్పుడూ ముందుకు రాదు' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

యుద్ధానికి వెళ్తా.. : 'పీవోకేను ఇండియా స్వాధీనం చేసుకోవాలి. పీవోకే నుంచి పాక్‌ను ఖాళీ చేయడమే సమస్యకు పరిష్కారం. మన జోష్ చూసి పాక్ ఎదుర్కొనే ధైర్యం చేయదు. యుద్ధం మొదలైతే నేను కూడా పాల్గొంటా. నా అవసరం ఏ మాత్రం ఉన్నా యుద్ధానికి వెళ్తా' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

అటు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సరిహద్దు రాష్ట్రాల్లోని తెలంగాణ వాసుల కోసం.. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది మన ప్రభుత్వం. కంట్రోల్ రూమ్ నెంబర్- 011-23380556 అని అధికారులు వెల్లడించారు. ఈ నంబర్‌కు కాల్ చేస్తే.. సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

భద్రత కట్టుదిట్టం..అటు ఇస్రో కేంద్రాల దగ్గర హై అలర్ట్ ప్రకటించారు. శ్రీహరికోట, బెంగళూరు సహా 11 కేంద్రాల్లో అలర్ట్ ప్రకటించారు. పాక్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం చేశారు. ఇస్రో కేంద్రాల దగ్గర సీఐఎస్ఎఫ్ సిబ్బంది సంఖ్యను పెంచారు. ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కోవడానికి సింసిద్ధంగా ఉన్నామని.. సీఐఎస్ఎఫ్ స్పష్టం చేసింది.

జవాన్ మృతి.. జమ్ముకశ్మీర్‌లో తెలుగు జవాన్ మృతిచెందారు. పాక్ కాల్పుల్లో జవాన్ మురళీ నాయక్ మృతిచెందారు. మురళీ నాయక్ స్వస్థలం శ్రీసత్యసాయి జిల్లా కల్లి తండా. శనివారం స్వస్థలానికి మురళీ నాయక్ మృతదేహం వచ్చే అవకాశం ఉంది. ఆయన మృతిపట్ల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం వైఎస్ జగన్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ విచారం వ్యక్తం చేశారు.

## నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు తెలంగాణ ప్రజా ప్రతినిధుల విరాళం.. సీఎం నిర్ణయం!

మొదటి పేజి తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించారు. సీఎం సూచన మేరకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో చర్చించి ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించనున్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించాలని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. కాగా, భారత్-పాక్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జమ్మూలో పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాకిస్తాన్, పీవోకేలో ఉన్న ఉగ్రస్థావరాలపై ఎయిర్‌స్ట్రైక్ చేసిన విషయం తెలిసిందే. దీంతో పాకిస్తాన్ కయ్యానికి కాలు దువ్వుతోంది. భారత్ సరిహద్దు ప్రాంతాల్లో కాల్పులకు తెగబడుతోంది. డ్రోన్ల సహాయంతో భారత సైనిక స్థావరాలపై దాడి చేసేందుకు ప్రయత్నించింది. అందుకు భారత్ సైతం దాడులను సమర్ధవంతంగా తిప్పి కొడుతోంది.

## జర్నలిస్టులందరికీ ఇందరమ్మ ఇళ్లు.. మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసాయం రఘురామరెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సహా పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధినిర్వహణలో చనిపోయిన, అనారోగ్యం బారిన జర్నలిస్టు కుటుంబాలకు చెక్కులను అందజేశారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద జర్నలిస్టులకు, చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. అలాగే మూతబడిన ప్రెస్ అకాడమిని ఈ నెల చివరిలోగా తిరిగి ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.

## దేశాన్ని రక్షించే శక్తి మోదీ.. దేశం యుద్ధ వాతావరణాన్ని ఎదుర్కొంటోంది

మొదటి పేజి తరువాయి

దేశ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పహల్గామ్‌లో అమాయకులైన మన వారిని ఉగ్రవాదులు దారుణంగా హతమార్చడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. భారతదేశం ఎల్లప్పుడూ ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, ప్రపంచంలో ఎక్కడా హింసకు తావులేదని ప్రధాని పదేపదే స్పష్టం చేస్తుంటారని గుర్తుచేశారు. పాకిస్థాన్ నిరంతరం మన దేశంపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూ, దాడులు చేస్తోందని ఆయన మండిపడ్డారు. దేశ రక్షణ కోసం ఎంతో మంది యువకులు సైన్యంలో చేరుతున్నారని, వారి త్యాగాల వల్లే మనం ప్రశాంతంగా ఉండగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా, ఉగ్రవాదులతో జరిగిన పోరాటంలో వీరమరణం పొందిన తెలుగు బిడ్డ, సైనికుడు మురళీ నాయక్ గురించి ప్రస్తావిస్తూ, ఆయన మరణం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. మురళీ నాయక్ తల్లిదండ్రులతో తాను మాట్లాడి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశానని, ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. అనంతరం, చంద్రబాబు "భారత్ మాతాకీ జై" అంటూ నినాదాలు చేశారు. వీరమరణం పొందిన మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, సభలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.




భారత్- పాక్ యుద్ధం నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం

భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. సరిహద్దు రాష్ట్రాలలో నివసిస్తున్న లేదా ఆయా ప్రాంతాలకు ప్రయాణిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పౌరుల సౌకర్యార్థం న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను తక్షణమే ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. పాకిస్థాన్‌తో సరిహద్దును పంచుకుంటున్న జమ్మూకశ్మీర్, లడఖ్ తో పాటు, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఉన్న లేదా ఆ రాష్ట్రాలకు వెళుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు అవసరమైన సమాచారం, సహాయం కోసం ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని చంద్రబాబు సూచించారు. ఈ సహాయ కేంద్రం రోజులో 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ నిరంతరాయంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత సున్నితమైన పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ, కేంద్ర ప్రభుత్వం మరియు సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వ యంత్రాంగాలతో ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులు సమన్వయం చేసుకుంటున్నారని తెలిపారు. దీని ద్వారా రాష్ట్ర ప్రజలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సహాయం మరియు సమాచారం కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:

011-23387089,9871999430,9871999053

అదనపు సమాచారం లేదా ప్రత్యేక సహాయం కోసం:

ఎం.వి.ఎస్. రామారావు, డిప్యూటీ కమిషనర్: 98719 90081.

వి. సురేశ్ బాబు, లైజన్ ఆఫీసర్: 9818395787.

## తిరుమలలో చైనీస్ ఫుడ్ పై నిషేధం.. హోటళ్లకు మార్గదర్శకాలు జారీ!

మొదటి పేజి తరువాయి

విక్రయించడంపై శాశ్వతంగా నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. భక్తుల ఆరోగ్యం, ఆహార నాణ్యత దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు టీటీడీ వర్గాలు వెల్లడించాయి. తిరుమలలోని హోటళ్లు, తినుబండారాల శాలల్లో లభించే ఆహార పదార్థాల నాణ్యతపై ఇటీవల భక్తుల నుంచి పలు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి తిరుమలలోని హోటళ్ల యజమానులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భక్తులకు అందించే ఆహారం విషయంలో పలు ముఖ్యమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ప్రధానంగా చైనీస్ ఫుడ్ అంశం చర్చకు వచ్చింది. ఇకపై తిరుమలలో ఫ్రైడ్ రైస్, నూడుల్స్, మంచూరియా వంటి ఎలాంటి చైనీస్ తరహా ఆహార పదార్థాలను విక్రయించరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని, దీనిని కచ్చితంగా పాటించాలని హోటళ్ల నిర్వాహకులను ఆదేశించారు. భక్తులకు నాణ్యమైన, శుచికరమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల అభిరుచులకు అనుగుణంగా వారికి నచ్చిన రీతిలో వైవిధ్యమైన భారతీయ వంటకాలను అందించాలని సూచించారు. ఆహార తయారీలో, హోటళ్ల నిర్వహణలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని నొక్కిచెప్పారు. ఆహార నాణ్యతతో పాటు, హోటళ్ల నిర్వహణకు సంబంధించి కూడా అదనపు ఈవో పలు మార్గదర్శకాలను జారీ చేశారు. హోటళ్లలో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా సంప్రదాయాలను గౌరవిస్తూ, అందుకు అనుగుణమైన వస్త్రధారణలోనే విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి హోటల్ వద్ద ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ తదితర ధృవీకరణ పత్రాలను అధికారులకు, భక్తులకు స్పష్టంగా కనిపించేలా ఫ్రేమ్ చేసి ప్రదర్శించాలి చెప్పారు. భక్తుల సౌకర్యార్థం డిజిటల్ చెల్లింపుల విధానాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అన్ని దుకాణాలలో తప్పనిసరిగా ధరల పట్టికను ప్రదర్శించాలని, నిర్దేశిత ధరలకే విక్రయాలు జరపాలని చెప్పారు. హోటల్ నిర్వహణ లైసెన్సులను నిర్ణీత సమయంలో పునరుద్ధరించుకోవాలని స్పష్టం చేశారు.

## ఈ పోరులో ఇండియా గెలుస్తుంది, సందేహం లేదు: యోగి

మొదటి పేజి తరువాయి

పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలంతా జాతీయ ఐక్యతకు కట్టుబడి ప్రజలంతా మన సాయుధ బలగాలకు అండగా నిలబడాలని యోగి కోరారు. ప్రతి ఒక్క భారతీయుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఎవరైనా తప్పుడు సమాచార వ్యాప్తి చేస్తే, అంతా అప్రమత్తంగా ఉండి జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే ఎలాంటి చర్యలనైనా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదకగా తప్పుడు ప్రచారం జరగవచ్చని, అయితే వాటిని పట్టించుకోకుండా ప్రధాన మంత్రి నాయకత్వాన్ని అనుసరించాలన్నారు. "భారతదేశం గెలుచితీరుతుంది... అందులో సందేహం లేదు" అని యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో ఎలా కలిసికట్టుగా దేశానికి సేవలందించాలో మహారాణా ప్రతాప్ జయంతి ద్వారా స్ఫూర్తి పొందాలన్నారు. ఈ తరుణంలో మన భద్రత బలగాలకు బాసటగా నిలిచి వారి ఆత్మస్థైర్యాన్ని మరించ పెంచుతామని ప్రజలంతా ప్రతిన బూనాలని కోరారు.

## పాకిస్థాన్‌కు ఆర్థిక సహాయంపై ఐఎంఎఫ్ సమీక్ష: అభ్యంతరాలు వ్యక్తం చేయనున్న భారత్

మొదటి పేజి తరువాయి

ఆ దేశం ఉగ్రవాద కార్యకలాపాలకు, ముఖ్యంగా లష్కరే తోయిబా (ఎల్ఈటీ), జైషే మహమ్మద్ (జేఈఎం) వంటి సంస్థలకు పరోక్షంగా నిధులు సమకూర్చడానికి వాడుకుంటోందని మిస్రీ ఆరోపించారు. "పాకిస్థాన్ ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రంగా మారిందనడానికి అనేక ఉదాహరణలున్నాయి. ఒసామా బిన్ లాడెన్ ఎక్కడ దొరికాడో, అతడిని అమరవీరుడని ఎవరు కీర్తించారో గుర్తుచేయనవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితిచే నిషేధించబడిన అనేకమంది ఉగ్రవాదులు పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారని కూడా ఆయన ప్రస్తావించారు. గతంలో పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ ఇచ్చిన 24 బెయిలౌట్ ప్యాకేజీలలో చాలా వరకు విజయవంతం కాలేదని మిస్రీ గుర్తుచేశారు. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్, మాజీ విదేశాంగ మంత్రి కూడా తమ దేశానికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని ఇటీవల అంగీకరించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్, ఐఎంఎఫ్ సహాయంపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. ఏప్రిల్ 22న కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి, ఆ తర్వాత పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ చేపట్టిన "ఆపరేషన్ సిందూర్" వంటి పరిణామాల నేపథ్యంలో ఈ ఐఎంఎఫ్ సమీక్ష ప్రాధాన్యతను సంతరించుకుంది. మే 7, 8 తేదీల్లో పాకిస్థాన్ ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని పలు సైనిక స్థావరాలపై దాడి చేసిందని భారత సైన్యానికి చెందిన కల్నల్ సోఫియా ఖురేషి ధృవీకరించారు. అయితే, పరిస్థితిని ఉద్రిక్తం చేసే ఉద్దేశం తమకు లేదని, పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగానే చర్యలు తీసుకున్నామని మిస్రీ స్పష్టం చేశారు. శుక్రవారం జరిగే ఐఎంఎఫ్ సమీక్షలో తదుపరి విడత నిధులు పొందేందుకు పాకిస్థాన్ అవసరమైన షరతులను నెరవేర్చిందో లేదో నిర్ణయిస్తారు. ఈ నేపథ్యంలో ఐఎంఎఫ్‌లో భారత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రస్తుత ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమేశ్వరన్ అయ్యర్ ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు) దేశం వైఖరిని సమర్థవంతంగా తెలియజేస్తారని మిస్రీ విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఆ రోజులు దగ్గరలోనే ఉన్నాయి.. బాబు సర్కార్‌కు సజ్జల వార్నింగ్

మొదటి పేజి తరువాయి

బాధ్యత కలిగిన పౌరుడిగా విచారణకు వచ్చానని తెలిపారు. గతంలో కూడా ఒకసారి విచారణకు వచ్చానని చెప్పారు ప్రజాస్వామ్యంలో పట్టాభిలాగా బూతులు మాట్లాడరు. టీడీపీ నాయకుడు పట్టాభి ఎలా మాట్లాడాడో అందరికీ తెలుసునని సజ్జల అన్నారు."దాడులకు మా నాయకుడు జగన్ వ్యతిరేకం. మాట్లాడే సమయంలో సంయమనంతో ఉండాలి. ఆ ఘటన జరిగిన సమయంలో నేను ఊళ్లో లేను. అధికారులు అడిగిన ప్రశ్నకి నాకేమీ తెలియదని సమాధానం చెప్పాను. ఏడాది కాలంగా రెడ్ బుక్ వేధింపులు ఎక్కువయ్యాయి. ఎన్నికలకు ముందునుంచే రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించారు. ఇష్టం వచ్చినట్లు కేసులు పెట్టడం, వేధించడం జైలుకు పంపడమే పనిగా పెట్టుకున్నారు. చంద్రబాబు నుంచి కిందిస్థాయి వరకూ ఇదే విధంగా వ్యవహరిస్తున్నారు. కంతేరు ఎంపీటీసీ అయిన మహిళ పట్ల కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు" అని సజ్జల పేర్కొన్నారు."మా వాళ్లు కేసు ఇస్తే తీసుకోలేదు.. వాళ్లు ఇస్తే మాత్రం దుర్మార్గంగా అరెస్టు చేశారు. కూటమి ప్రభుత్వం పథకం ప్రకారం వ్యవస్థీకృత టెర్రరిజాన్ని క్రియేట్ చేస్తున్నారు. మహిళల పట్ల పోలీసులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారు. కాలం ఎప్పుడూ ఇలాగే ఉండదు. రేపు మేం అధికారంలోకి వచ్చి ఇలాగే మొదలుపెడితే ఎలా ఉంటుంది?. మీరు వేసిన విత్తనం చాలా ప్రమాదకరమైనది. పోసాని ఎప్పుడో మాట్లాడితే కేసు పెట్టారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటికి ఎలాంటి అనుమతి లేకుండా పోలీసులు వెళ్లారు. పవిత్రమైన జర్నలిజం వృత్తిలో ఉన్న వారిని కూడా వదలటం లేదు. ఇలాంటి ఉన్మాద చర్యలు ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయో ఆలోచించండి" అంటూ సజ్జల హితవు పలికారు. "మీరు ఎంతమందిని జైలులో పెడతారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి కృత్రిమ కుంభకోణాలు సృష్టిస్తున్నారు. లిక్కర్ స్కాం కూడా తప్పుడు కేసే. ఏడాది దాటింది.. ఇప్పటికైనా వాస్తవంలోకి రండి. లేకపోతే జనం తరిమికొట్టే రోజులు వస్తాయి" అని సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరించారు.

## కాంగ్రెస్ మాటలు విని ప్రజలు మోసపోయారు : కేటీఆర్

మొదటి పేజి తరువాయి



ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు విని రాష్ట్ర ప్రజలంతా మోసపోయారని, ఇప్పుడిప్పుడే ప్రజలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇచ్చిన హామీలు అమలు కోసం నిరంతరం పట్టుబడుతామని స్పష్టం చేశారు.

దివాళాకోరు ముఖ్యమంత్రి రేవంత్..

రేవంత్ రెడ్డి దివాళాకోరు ముఖ్యమంత్రి అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఢిల్లీ వెళ్తే దొంగల్లా చూస్తున్నారన్న రేవంత్ ను.. దొంగను దొంగలా చూడకపోతే ఎలా చూస్తారని విమర్శించారు. గుడిలో చెప్పులు ఎత్తుకుపోయేవారిలా చూస్తున్నారనడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఢిల్లీ పార్టీలను నమ్ముకుంటే ఐదేళ్లు శిక్ష అనుభవించక తప్పదంటూ పేర్కొన్నారు. ఉన్న పథకాలను ఎత్తి వేస్తున్న ప్రభుత్వం కొత్త స్కీంలను ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్, రైతుబంధు, రుణమాఫీ, పెన్షన్ పెంపు ఇలా ఎన్నో పథకాలు ఆగిపోయాయని విమర్శించారు. మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే ప్రజల్లో ఎలాంటి మార్పు వచ్చిందో గమనించాలని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులు కడితే ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ నీళ్లు నెత్తిన చల్లుకున్నారే తప్ప.. చుక్క నీరివ్వలేదని ధ్వజమెత్తారు.

ముగ్గురు మంత్రులున్నా చేసింది శూన్యం..

ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా చేసింది శూన్యమని, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటని కేటీఆర్ విమర్శించారు. పాలేరులో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా భారీ మెజార్టీతో కందాళ ఉపేందర్ రెడ్డి గెలువడం ఖాయమని అన్నారు. భద్రాచలంలో ఉపఎన్నికలు రావడం ఖాయమని, మధ్యంతర ఎన్నికలకు జిల్లాలోని బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు అందరూ కలిసికట్టుగా పనిచేసి ఆ స్థానాన్ని కైవసం చేసుకోవాలని సూచించారు.

లింగాల కమల్ రాజ్ ను ఓడించేందుకు భట్టి విక్రమార్క ప్రజలకు తప్పుడు హామీలిచ్చారని, బాండ్ పేపర్లు రాసి దేవుని గుడిలో పెట్టి ఎన్నికల్లో గెలిచిన భట్టి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే షాక్ ఇవ్వాలని, అందుకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వర్ రావు, మెచ్చా నాగేశ్వర్ రావు తదితరులున్నారు.

## ఆర్మీ చీఫ్‌కు కేంద్రం కీలక అధికారాలు... ఏమిటీ టెరిటోరియల్ ఆర్మీ?

మొదటి పేజి తరువాయి

వాటిని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. ఈ నేపథ్యంలో, పాకిస్థాన్ సరిహద్దుల్లో మరిన్ని అలజడులు సృష్టించేందుకు కుట్ర పన్నుతోందన్న నిఘా సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా, భారత సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టింది. అవసరమైతే, టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఇందులోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని తక్షణమే విధుల్లోకి పిలిపించి, రెగ్యులర్ ఆర్మీతో కలిసి పనిచేసేలా ఆదేశించే అధికారాన్ని ఆర్మీ చీఫ్‌కు అప్పగించింది.



టెరిటోరియల్ ఆర్మీ అంటే?

టెరిటోరియల్ ఆర్మీని క్లుప్తంగా 'సైనిక రిజర్వ్ దళం' అని చెప్పవచ్చు. దేశానికి క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పుడు, సాధారణ సైన్యానికి మద్దతుగా నిలిచేందుకు ఈ దళాలు సిద్ధంగా ఉంటాయి. వీరికి కూడా రెగ్యులర్ సైనికులతో సమానంగా కఠినమైన శిక్షణ ఇస్తారు. అయితే, వీరు నిరంతరం సైన్యంతో ఉండరు. తమతమ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూనే, స్వచ్ఛందంగా దేశసేవలో పాలుపంచుకుంటారు. 1948లో భారత టెరిటోరియల్ ఆర్మీ చట్టాన్ని ఆమోదించగా, 1949లో ఇది అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రస్తుతం ఈ దళంలో సుమారు 50 వేల మంది క్రియాశీలకంగా ఉన్నట్లు అంచనా. గతంలో 1962, 1965, 1971 యుద్ధ సమయాల్లో టెరిటోరియల్ ఆర్మీ భారత రెగ్యులర్ ఆర్మీతో కలిసి పోరాడింది. కేవలం యుద్ధ సమయాల్లోనే కాకుండా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కూడా ఈ దళాలు సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటాయి. ఇటీవల కేరళ వరదల సమయంలో ప్రముఖ నటుడు మోహన్‌లాల్, టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా తనవంతు సేవలు అందించడం గమనార్హం.

ధోనీ, కపిల్ దేవ్, అభినవ్ బింద్రా, అనురాగ్ ఠాకూర్, సచిన్ పైలట్ లెఫ్టినెంట్ కర్నల్ స్థాయి అధికారులు

భారత క్రికెట్ మాజీ కెప్టెన్ ఎం.ఎస్. ధోనీ, దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ వంటి పలువురు ప్రముఖులు కూడా టెరిటోరియల్ ఆర్మీలో గౌరవ హోదాలు కలిగి ఉన్నారు. నిర్దిష్ట కాలంపాటు సేవలు అందించిన వారికి పింఛను, ఇతర ప్రయోజనాలు (క్యాంటీన్, వైద్య సదుపాయాలు, ఎల్‌టీఏ) కూడా వర్తిస్తాయి. టెరిటోరియల్ ఆర్మీకి చెందిన అనేక మంది అధికారులు శౌర్య, విశిష్ట సేవా పురస్కారాలు అందుకున్నారు.

సాయి సూర్య తెలుగు దిన పత్రిక www.saisuryaa.com
శనివారం - 10 - మే - 2025

సాయి సూర్య తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

## అదనుచూసి పదునైన పాఠం!

### (విశ్లేషణ)

తీరికూర్చుని భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో జగడాలమారి పాకిస్తాన్‌కూ, దాని కీలుబొమ్మలైన ఉగ్రమూకలకూ తెలిసొచ్చి ఉండాలి. 2016 నాటి 'ఉరి' సర్జికల్ దాడులు, 2019 నాటి బాలాకోట్ వైమానిక దాడులకు అనేక రెట్లు అధికంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక 'ఆపరేషన్ సిందూర్' సంకేతనామంతో మన త్రివిధ దళాలు పకడ్బందీ సమన్వయంతో పాకిస్తాన్‌లోనూ, ఆక్రమిత కశ్మీర్ లోనూ తొమ్మిది చోట్ల గంటసేపు సాగించిన క్షిపణి దాడులు పాక్ సైన్యాన్నీ, ఉగ్రమూకల్నీ గుక్క తిప్పుకోనీయకుండా చేశాయి. ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలూ, వారి ఆయుధ గిడ్డంగులూ, ఇతరేతర అవసరాలకు వినియోగిస్తున్న బహుళ అంతస్తుల భవంతులూ లక్ష్యంగా మొత్తం 24 చోట్ల సాగించిన దాడుల్లో 70 మంది వరకూ ఉగ్రవాదులు మరణించగా, మరో 60 మంది గాయపడ్డారని చెబు తున్నారు. ఉగ్రవాద ముఠాలైన జైషే మొహమ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా(ఎల్ఈటీ) ప్రధాన కార్యాలయాలు రెండూ కుప్పకూలాయని సమాచారం. జేఈఎం చీఫ్ మసూర్ అజర్ సోదరితోసహా అతగాడి కుటుంబానికి చెందిన పదిమంది హతమయ్యారని కూడా చెబుతున్నారు. జరిగిన నష్టాన్ని కప్పెట్టే ఎత్తుగడతో అయిదు భారత్ విమానాలను కూల్చామంటూ పాక్ స్వోత్కర్షలకు పోతోంది. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి పాక్ లోలోపలివరకూ చొచ్చుకెళ్లి దాడులు సాగించిన తీరూ, ఒక్క క్షిపణి కూడా గురితప్పకుండా శత్రుమూకలపై చంద్రనిప్పులు కురిపించిన విధానం మన త్రివిధ దళాల పకడ్బందీ అంచనాలకూ, పదునైన వ్యూహచతురతకూ దర్పణాలు. పాక్ గడ్డపై గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఉగ్రశిబిరాల ఆనుపానుల్ని శత్రునేత్రానికి చిక్కని విధంగా గత పక్షం రోజులుగా మానవ రహిత విమానాలతో జల్లెడపట్టాకే ఈ దాడులు జరిగాయి. పహల్‌గామ్ సమీపంలో అకారణంగా, అన్యాయంగా నిరాయుధ భారత పౌరులను గురిచూసి కాల్చిచంపటానికి కిరాయిమూకల్ని పంపి కొన్నిరోజులుగా పాకిస్తాన్ మురుస్తోంది. దీనిపై నిలదీస్తే షరా మామూ లుగా సాక్ష్యాలడుగుతోంది. గత నెల 22న పహల్‌గామ్ సమీపంలో ఉగ్రవాద ముఠా 26 మందిని పొట్టనబెట్టుకున్నప్పటి నుంచీ భారత ప్రజ ప్రతీకారంతో రగిలిపోతోంది. కంటికి కన్ను సిద్ధాంతం పాటించి గట్టి దెబ్బతీయాల్సిందేనన్న అభిప్రాయం అలుముకుంది. ఈ నేపథ్యంలో మన దళాల దాడులు విజయవంతం కావటం అందరినీ సాంత్వన పరుస్తుందనటంలో సందేహం లేదు. అనుకోని పరిణామాలు తలెత్తితే అనుసరించాల్సిన పద్ధతులపై పౌరులకు అవగాహన కల్పించటానికి బుధవారం మాక్ డ్రిల్ జరగటం, అంతకుముందు రోజు రాత్రే మన త్రివిధ దళాలు దాడులు చేయటం గమనిస్తే వర్తమానం ఎంత జటిలంగా ఉన్నదో అర్థమవుతుంది. ఇది మనం కోరుకున్నది కాదు. మన ప్రమేయం లేకుండా వచ్చిపడిన విపత్తు. అకారణంగా మనపై రుద్దిన సంక్లిష్ట సమస్య. దీనికి దీటుగా స్పందించకపోతే ఉగ్రదాడులకు అంతూ పొంతూ ఉండదు. కనుకనే పహల్‌గామ్ మారణకాండ గురించి తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ పర్యటనను రద్దుచేసుకుని వెను దిరిగారు. ఆ వెంటనే మంత్రివర్గ సహచరులతో, త్రివిధ దళాల అధిపతులతో వరస సమాలోచనలు సాగించారు. ఎప్పుడు, ఎక్కడ ఎలా దాడులు సాగించాలో, తీవ్రత ఏ స్థాయిలో వుండాలో మీరే నిర్ణ యించండంటూ మన దళాలకు అధికారం ఇచ్చారు. పర్యవసానంగానే పాక్ ప్రాపకంతో చెలరేగి పోతున్న ఉగ్రముఠాలకు గట్టి సమాధానం వెళ్లింది. ఈ దాడులకు చాలాముందే ఇతరేతర నిర్ణ యాలు తీసుకున్నారు. సింధూ నదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు ప్రకటించ టంతోపాటు ఇండియా పలు చర్యలు తీసుకుంది. దీన్నంతటినీ గమనిస్తున్నవారికి మన దేశం సైనిక చర్యకు కూడా వెనకాడబోదని పక్షం రోజుల క్రితమే అర్థమైంది.యుద్ధం దేనికీ పరిష్కారం కాకపోవచ్చు. చర్చలే అంతిమంగా ఎంతటి జటిల సమస్యనైనా పరిష్కరిస్తాయన్న సిద్ధాంతం కూడా సరైనదే కావొచ్చు. కానీ పొరుగు పచ్చగావుంటే ఓర్వలేక నిష్కారణంగా దాడులకు దిగే నైజాన్ని శాంతిప్రవచనాలతో ఎదుర్కొనటం సాధ్యమేనా? ఒకపక్క పహల్‌గామ్ దాడులతో సంబంధం లేదంటూనే గత కొన్ని రోజులుగా అధీనరేఖ వద్దా, అంత ర్జాతీయ సరిహద్దు వద్దా పాక్ ఎలాంటి కవ్వింపూ లేకుండా కాల్పులకు దిగుతోంది. ఈ దాడుల కారణంగా ఒక్క బుధవారంనాడే పూంఛ్ జిల్లా గ్రామాల్లో 12 మంది పౌరులు బలయ్యారు.తన దుష్ట పన్నాగాలను కప్పిపుచ్చటానికి భద్రతామండలిలో పాకిస్తాన్ అమాయకత్వం నటిస్తూ భారత్ తీసు కుంటున్న వరస చర్యలకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలని విఫలయత్నం చేసింది. రేపో మాపో అది నేరుగా సైన్యాన్ని రంగంలోకి దించి ప్రతీకారం పేరిట చెలరేగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఉగ్రముఠాల ద్వారా మారణహోమానికి పాల్పడటం కన్నా ఒకరకంగా ఇది మంచిదే. భారత్ బెదిరిపోయి సైనిక దాడుల ఆలోచన మానుకుంటుందన్న తప్పుడు ఆలోచనతో కొన్ని రోజులుగా అది అణుబాంబు బెదిరింపులకు కూడా తెగించింది. ఆ దుస్సాహసానికి పూనుకుంటే చేజేతులా స్వీయవినాశనాన్ని కొనితెచ్చుకున్నానని పాక్ పశ్చాత్తాపపడే రోజు ఎంతో దూరంలో ఉండదు. ఈ కష్టకాలంలో దేశ ప్రజానీకం కుల మత భేదాలు మరిచి కలిసికట్టుగా ఉండటం అత్య వసరం. ఇదే అదనుగా నాలుగు ఓట్ల కోసమో, మరికొన్ని సీట్ల కోసమో ప్రజల్లో వైషమ్యాలు సృష్టించాలని చూసే అవాంఛనీయ శక్తుల్ని అందరూ సకాలంలో పోల్చుకుని దూరం పెట్టడం, తగిన బుద్ధి చెప్పటం ఎంతో అవసరం. మనలోని సమష్టితత్వమే ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనే ధైర్యాన్ని స్తుంది. విజయాన్ని మన చేతికందిస్తుంది.

# ఉగ్రవాదులు, పాక్ సైన్యం కలిసి..
# ప్రపంచానికి ఇంతకంటే ప్రూఫ్ ఏం కావాలి

: ప్రపంచ దేశాల్లారా ఇదిగో సాక్ష్యం.. పాకిస్తాన్‌లో సైన్యానికి, టెర్రరిస్టులకు మధ్య ఎలాంటి తేడా లేదనడానికి ఇదో ప్రత్యక్ష నిదర్శనం. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఒక వీడియోలో పాకిస్తాన్ ఆర్మీకి చెందిన ఉన్నతాధికారులు బహిరంగంగా టెర్రరిస్టుల అంత్యక్రియల్లో పాల్గొనడం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ దృశ్యం పాకిస్తాన్ నిజ స్వరూపాన్ని ప్రపంచానికి చాటి చెబుతోంది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ అసలు ముఖం మరోసారి బయటపడింది. ఈ వీడియోలో కనిపిస్తున్న దృశ్యాలు అత్యంత ఆందోళనకరమైనవి. పాకిస్తాన్ ఆర్మీకి చెందిన యూనిఫామ్ ధరించిన అధికారులు, టెర్రరిస్టుల అంతిమ యాత్రలో గౌరవంగా నిలబడి ఉండడం, వారి అంత్యక్రియల కార్యక్రమాలలో పాల్గొనడం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం సాధారణ సైనికులు పాల్గొనడం కాదు, ఉన్నత స్థాయి అధికారులు కూడా ఉగ్రవాదులకు సెల్యూట్ చేస్తూ వారి మృతికి సంతాపం తెలుపుతున్నట్లు కనిపిస్తోంది. టెర్రరిస్టులకు పాకిస్తాన్ ఆర్మీ బహిరంగంగా మద్దతు తెలుపుతున్న ఈ దృశ్యం, అంతర్జాతీయ సమాజానికి ఒక హెచ్చరిక లాంటిది. ఉగ్రవాదంపై పోరాడుతున్నామని ప్రపంచానికి చెబుతున్న పాకిస్తాన్, వాస్తవానికి ఉగ్రవాదులను ప్రోత్సహిస్తోందని ఈ వీడియో స్పష్టం చేస్తోంది. ఇలాంటి ఘటనలు ఇది మొదటిసారి కాదు. గతంలో కూడా పాకిస్తాన్ ఆర్మీ టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు, వారికి ట్రైనింగ్ ఇస్తున్నట్లు అనేక నివేదికలు వెలువడ్డాయి. అంతర్జాతీయ వేదికలపై ఉగ్రవాదంపై పోరాటం గురించి మాట్లాడే పాకిస్తాన్, తెర వెనుక



ఉగ్రవాదులకు అన్ని విధాలా సహాయం చేస్తూ వస్తోంది. ఈ వీడియోతో ఆ వాదనలకు మరింత బలం చేకూరినట్లయింది. భారత్ ఎప్పటినుంచో పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపిస్తోంది. సరిహద్దుల్లో చొరబాట్లు, దాడులు చేయిస్తుంది పాకిస్తాన్ ఆర్మీ శిక్షణ పొందిన టెర్రరిస్టులే అని అనేక సార్లు ప్రూఫ్ లతో సహా తెలిపింది. ఇప్పుడు ఈ వీడియో భారత వాదనలకు మరింత బలం చేకూరుస్తోంది. పాకిస్తాన్ ఆర్మీ, టెర్రరిస్టులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ వీడియో కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది.

# పహల్గామ్ నుంచి ప్రతీకారం వరకు..
# ఆపరేషన్ సింధూర్ కథను ప్రపంచ మీడియా ఎలా చెప్పిందంటే!

: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దారుణమైన ఉగ్రదాడికి భారత్ తనదైన శైలిలో ప్రతీకారం తీర్చుకుంది. పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు చేసి టెర్రరిస్టులకు గట్టిగా బుద్ధి చెప్పింది. భారత్ చేపట్టిన ఈ చర్యను అంతర్జాతీయ మీడియా విస్తృతంగా కవర్ చేసింది. ప్రముఖ వార్తా సంస్థలు 'ఆపరేషన్ సింధూర్' పేరుతో భారత్ జరిపిన ఈ దాడులకు సంబంధించిన వార్తలను ప్రముఖంగా ప్రచురించాయి. అంతేకాకుండా, ఈ ఘటన భారత్, పాకిస్తాన్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను కూడా ప్రపంచానికి తెలియజేసింది.

ఆపరేషన్ సిందూర్.. కల్నల్ సోఫియా ఖురేషి పాత్ర ఏంటి?

ప్రపంచంలోని ప్రముఖ మీడియా సంస్థలు ఈ విషయంపై ఎలా స్పందించాయో ఇప్పుడు చూద్దాం:

సీఎన్ఎన్: ప్రముఖ అమెరికన్ వార్తా సంస్థ సీఎన్ఎన్ తన కథనంలో "పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాక్‌పై భారత్ వైమానిక దాడులు చేసింది" అని పేర్కొంది. భారత్ ఈ చర్య పహల్గామ్ దాడికి ప్రతిస్పందనగా జరిగిందని వారు తమ కథనంలో స్పష్టం చేశారు.

న్యూయార్క్ టైమ్స్: అమెరికాకు చెందిన మరో ప్రముఖ వార్తాపత్రిక న్యూయార్క్ టైమ్స్ ఈ దాడి గురించి రాస్తూ, "పహల్గామ్ ఉగ్ర దాడి జరిగిన రెండు వారాల అనంతరం పాక్‌పై భారత్ దాడి చేసింది" అని తెలిపింది. అంటే, భారత్ ఈ దాడిని తక్షణమే కాకుండా వ్యూహాత్మకంగా సమయం తీసుకుని అమలు చేసిందని వారు సూచించారు.

బీబీసీ: బ్రిటన్‌కు చెందిన ప్రఖ్యాత వార్తా సంస్థ బీబీసీ తన కథనాల్లో "పాక్, పాక్ ఆక్రమిత ప్రాంతాల్లోని తొమ్మిది స్థావరాలపై భారత్ వైమానిక దాడులు చేసింది" అని పేర్కొంది. భారత్ కేవలం పాకిస్తాన్‌లోనే కాకుండా, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకుందని బీబీసీ తెలిపింది.

అసోసియేటెడ్ ప్రెస్: అంతర్జాతీయ వార్తా సంస్థ అసోసియేటెడ్ ప్రెస్ ఈ ఘటనను మరింత తీవ్రంగా పరిగణించింది. "పాకిస్థాన్ భూభాగంలోకి భారత్ క్షిపణులు ప్రయోగించింది. ఇది యుద్ధ చర్య అని పాకిస్థాన్




పేర్కొంది" అని వారు తమ వార్తా కథనంలో పేర్కొన్నారు. పాకిస్తాన్ ఈ దాడులను యుద్ధ చర్యగా అభివర్ణించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

రాయిటర్స్: మరో ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ తన కథనంలో "కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై భారత్ వైమానిక దాడులు చేపట్టింది" అని రాసుకొచ్చింది. ఛ

పహల్గామ్‌లో అమాయక పర్యాటకులను లక్ష్యంగా చేసుకున్న ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుందని రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది.

మొత్తంగా, అంతర్జాతీయ మీడియా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'ను చాలా సీరియస్‌గా పరిగణించింది.

ఈ దాడులు భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉందని వివిధ వార్తా సంస్థలు అభిప్రాయపడ్డాయి. పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ ప్రతిస్పందనగా ఈ దాడులను అంతర్జాతీయ సమాజం చూస్తోంది. రాబోయే రోజుల్లో ఈ పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి.

# ఆపరేషన్ సిందూర్ బ్రీఫింగ్..
# దేశం దృష్టిని ఆకర్షించిన మహిళా అధికారులు



: 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు నిర్వహించింది. ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తయిందని, ఎటువంటి సైనిక స్థావరాలను లక్ష్యంగా చేయలేదని భారత్ ప్రకటించింది. ఈ దాడుల వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖలు బహిరంగపరిచాయి. ఈ బ్రీఫింగ్‌లో కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు కీలక పాత్ర పోషించి, దేశ దృష్టిని ఆకర్షించారు.

ఆపరేషన్ సింధూర్.. జైషే మహమ్మద్ చీఫ్ మౌలానా కు భారత ఆర్మీ మాస్టర్ స్ట్రోక్!

మే 7, 2025న అర్ధరాత్రి దాటిన తర్వాత భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం సమన్వయంతో 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించాయి. పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్, మురిద్కే, సియాల్‌కోట్‌తో సహా పీఓకేలోని కోట్లి, ముజఫరాబాద్ వంటి తొమ్మిది ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడులు జైషే మహ్మద్, లష్కరే తోయిబా వంటి సంస్థల కార్యకలాపాలను ధ్వంసం చేశాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. ఈ దాడులు ఖచ్చితమైనవి, అనవసర ఉద్రిక్తతలను నివారించేలా రూపొందించినవని రక్షణ శాఖ పేర్కొంది.

దాడుల లక్ష్యాలు

బహవల్‌పూర్ (జైషే మహ్మద్ హెడ్‌క్వార్టర్): పుల్వామా దాడి సహా అనేక ఉగ్ర కుట్రలకు కేంద్రంగా ఉన్న స్థావరం.మురిద్కే (లష్కరే తోయిబా హెడ్‌క్వార్టర్): 26/11 ముంబై దాడులకు శిక్షణ కేంద్రంగా వినియోగించబడింది.కోట్లిలోని అబ్బాస్ క్యాంప్: ఆత్మాహుతి దాడులకు శిక్షణ ఇచ్చే కేంద్రం, మే 7, 2025న 1:04 అ%వీ%కి ధ్వంసం చేయబడింది.ముజఫరాబాద్, సియాల్‌కోట్: ఉగ్రవాదుల రవాణా, శిక్షణ కేంద్రాలుగా పనిచేసే స్థావరాలు.ఈ ఆపరేషన్ పహల్గాం దాడిలో భర్తలను కోల్పోయిన మహిళలకు నివాళిగా 'సిందూర్' అని నామకరణం చేయబడింది. ఈ దాడులు భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను నిర్వీర్యం చేయడంలో కీలకమైనవని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ పేర్కొన్నారు.

### ఎవరీ కర్నల్ సోఫియా ఖురేషి..?

గుజరాత్‌కు చెందిన కర్నల్ సోఫియా ఖురేషి బయోకెమిస్ట్రీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1990లో ఆర్మీ సిగ్నల్ కార్ప్స్‌లో చేరిన ఆమె, మూడు దశాబ్దాల సైనిక సేవలో అనేక విజయాలు సాధించారు. 2006లో ఐక్యరాష్ట్ర సమితి శాంతి మిషన్‌లో భాగంగా కాంగోలో పీస్‌కీపర్‌గా విధులు నిర్వహించారు. 2016లో పుణెలో జరిగిన 'ఎక్సర్సైజ్ 18' అనే బహుళజాతి సైనిక విన్యాసంలో 18 దేశాల బృందానికి నాయకత్వం వహించి, మహిళా అధికారిగా చరిత్ర సృష్టించారు. ఈ కార్యక్రమంలో శాంతి పరిరక్షణ, మందుపాతర తొలగింపు వంటి అంశాలపై దృష్టి సారించారు.

### పనితీరు, ప్రశంసలు

సోఫియా ఖురేషి రాజీలేని వైఖరి, నాయకత్వ లక్షణాలు ఆమెను విశిష్ట అధికారిగా నిలిపాయి. భారత్ యొక్క తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ ఆమె పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ బ్రీఫింగ్‌లో ఆమె స్పష్టమైన వివరణ, వ్యూహాత్మక విశ్లేషణ దేశ ప్రజలను ఆకట్టుకున్నాయి.

### వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఆకాశంలో సాహసం

వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ చిన్నప్పటి నుంచి పైలట్ కావాలని కలలు కన్నారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసిన ఆమె, ఎన్‌సీసీలో చేరి తన కలను సాకారం చేసుకున్నారు. 2019 డిసెంబర్ 18న భారత వైమానిక దళంలో ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ పొందారు. తన కుటుంబంలో సైన్యంలో చేరిన తొలి వ్యక్తిగా ఆమె గుర్తింపు పొందారు.

సవాలు నిండిన విధులు

వ్యోమికా సింగ్ జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఎత్తయిన ప్రాంతాల్లో చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపారు. అత్యంత సవాళ్లతో కూడిన రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్ బ్రీఫింగ్‌లో ఆమె సైనిక వైమానిక వ్యూహాలను వివరించి, దాడుల సాంకేతిక విజయాన్ని స్పష్టం చేశారు.

### ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర

ఆపరేషన్ సిందూర్ బ్రీఫింగ్‌లో కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు మహిళా సామర్థ్యాన్ని చాటిచెప్పారు. ఈ దాడులు పహల్గాం దాడిలో భర్తలను కోల్పోయిన మహిళలకు న్యాయం చేయడానికి ఒక సంకేతంగా చూడవచ్చు. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి, ఒక కశ్మీరీ పండిట్‌గా, ఈ ఆపరేషన్‌ను వ్యూహాత్మక విజయంగా అభివర్ణించారు. ఈ బ్రీఫింగ్ ద్వారా భారత్ తన సైనిక సామర్థ్యం, సమన్వయ కృషిని ప్రపంచానికి చాటింది. ఆపరేషన్ సిందూర్ భారత సైన్యం కచ్చితతా సామర్థ్యాన్ని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దృఢ నిర్ణయాన్ని ప్రదర్శించింది. కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఈ ఆపరేషన్ బ్రీఫింగ్‌లో చూపిన నాయకత్వం మహిళా శక్తి, సైనిక సామర్థ్యం సమ్మిళిత రూపాన్ని తెలియజేసింది.

## ఆ స్కామ్ లో విజయవాడ పాలేరు కూడా ఉన్నారు



అమరావతి: విజయవాడ పాలేరుకు చాలా కంపెనీలు ఉన్నాయని కేశినేని శివనాథ్ ఆరోపణలు చేశారు. మాజీ ఎంపి కేశినేని నాని చేసిన ఆరోపణపై టిడిపి ఎంపి కేశినేని శివనాథ్ రీకౌంటర్ ఇచ్చారు. వాటి గురించి కూడా నిగ్గు తేలిస్తే బాగుంటుందని, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితో రాజ్ కేసిరెడ్డికి సాన్నిహిత్యం ఉందని, అందుకే రాజ్ కేసిరెడ్డిని దూరంగా పెట్టారని స్పష్టం చేశారు. ఎపిలో రూ.3200కోట్ల విలువైన లిక్కర్‌స్కామ్ జరిగిందని శివనాథ్ ఆరోపణలు చేశారు. తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్నవ్యక్తే ప్రధాన సూత్రధారి అని, ఆ ప్యాలెస్‌లో రాజ్‌తో సహా నలుగురికే ఎంట్రీ ఉంటుందని ఎద్దేవా చేశారు. తనపై వచ్చిన ఆరోపణలపై సిబిఐ విచారణకు సిద్ధంగా ఉన్నానని చిన్ని సవాల్ విసిరారు. 24 గంటల సమయం ఇస్తున్నానని తనపై వచ్చిన ఆరోపణలు నిరూపణ చేయాలని జగన్ మోహన్ రెడ్డికి ఛాలెంజ్ చేశారు. లిక్కర్ స్కామ్ లో సిబిఐ విచారణకు జగన్ సిద్ధంగా ఉన్నారని సవాల్ విసిరారు. ఈ స్కామ్ లో కృష్ణ మోహన్ రెడ్డి, గోవిందప్ప, ధనుంజయ రెడ్డితో సహా విజయవాడ పాలేరు కూడా ఉన్నాడని శివనాథ్ తీవ్రమైన ఆరోపణలు చేశారు.

## "ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు": రాజ్‌నాథ్ సింగ్..




**న్యూఢిల్లీ,:** "ఆపరేషన్ సిందూర్" ఇంకా ముగియలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన ప్రకటన చేశారు. గురువారం అన్ని రాజకీయ పార్టీలతో జరిగి ఆల్ పార్టీ మీటింగ్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. పాకిస్తాన్ దాడి చేస్తే తీవ్రమైన ప్రతీదాడి ఉంటుందని రక్షణ మంత్రి చెప్పారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 100కు పైగా ఉగ్రవాదుల్ని హతమార్చినట్లు అన్ని రాజకీయ పార్టీల నేతలకు రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. అయితే, భద్రతా కారణాల వల్ల సున్నితమైన విషయాలను ప్రభుత్వం పంచుకోలేదని ఆల్ పార్టీ మీట్‌లో ఆయన చెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత, భారత్ "ఆపరేషన్ సిందూర్" పేరుతో పాకిస్తాన్, పీఓకే లోని ఉగ్రవాద శిబిరాలను టార్గెట్ చేసింది. మిస్సైల్స్‌ని ఉపయోగించి విధ్వంసం సృష్టించింది. పాక్ పంజాబ్ ప్రావిన్స్, పీఓకే లోని 09 ప్రాంతాల్లో 24 స్ట్రైక్స్ చేసింది. ఈ దాడిలో లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద కార్యాలయాలతో పాటు వాటి శిక్షణా శిబిరాలు, హ్యాండ్లింగ్ పాయింట్లను నాశనం చేసింది. దీంతో, రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. పాకిస్తాన్ దాడి చేస్తుందనే ఊహాగానాలు వెలువడటంతో, భారత్ సరిహద్దుల్లో హై అలర్ట్ ప్రకటించింది.

## మాదాపూర్‌లోని ట్రైడెంట్ హెూటల్‌లో భద్రత కట్టుదిట్టం




**హైదరాబాద్, :** ప్రతిష్ఠాత్మక మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న క్రమంలో.. అలాగే దేశవ్యాప్తంగా 'ఆపరేషన్ సింధూర్' నేపథ్యంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న ట్రైడెంట్ హెూటల్‌లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. ఈ హెూటల్‌లోనే మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న అందమైన కంటెస్టెంట్‌లు బస చేస్తున్నారు. ట్రైడెంట్ హెూటల్ భద్రతా బాధ్యతలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. హెూటల్‌లో ఆక్టోపస్ టీమ్‌తో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. సైబరాబాద్ పోలీసులు హెూటల్‌లో పకడ్బందీగా భద్రతను ఏర్పాటు చేయగా, మాదాపూర్ పోలీసులు సీసీ కెమెరాల ద్వారా ప్రతి కదలికను నిశితంగా పరిశీలిస్తున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, మాదాపూర్ డీసీపీ వినీత్ కుమార్ స్వయంగా హెూటల్‌లోని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. హెూటల్ పరిసరాల్లో ప్రత్యేక బలగాలను మోహరించడంతో పాటు, సందర్శకులపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. 'ఆపరేషన్ సింధూర్' నేపథ్యంలో నగరంలో అలర్ట్ ప్రకటించిన పోలీసులు, మిస్ వరల్డ్ పోటీలు జరుగుతుండటంతో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ కార్యక్రమానికి ఎలాంటి ఆటంకం కలగకుండా, అలాగే నగరంలో శాంతిభద్రతలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నతాధికారులుతెలిపారు. ట్రైడెంట్ హెూటల్ పరిసరాల్లో భద్రతా సిబ్బంది నిరంతర నిఘా కొనసాగుతోంది.

## చీనాబ్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తేసిన భారత్..
## పాకిస్తాన్‌లో భయం భయం..



పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఉగ్రదాడికి ప్రతీకారంగా "ఆపరేషన్ సిందూర్" చేపట్టింది. పాకిస్తాన్, పీఓకే లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ దాడిలో లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్ర కార్యాలయాలో పాటు శిక్షణా శిబిరాలు ధ్వంసం అయ్యాయి. దాదాపుగా 100 మంది వరకు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇదిలా ఉంటే, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో "సింధు జలాల ఒప్పందం" నిలుపుదల ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యంగా, చీనాబ్ నదిపై భారత్ నిర్మించిన సలాల్, బాగ్లిహార్ డ్యాముల గేట్లను మూసివేయడంతో పాకిస్తాన్‌లోని నది ఎండిపోయింది. తాజాగా, భారత్ బాగ్లీహార్ డ్యామ్ గేట్లు ఎత్తేయడంతో ఒక్కసారిగా వరద నీరు పాకిస్తాన్‌కి వెళ్తోంది. దీంతో మరోసారి, పాకిస్తాన్‌లో భయం పుట్టింది. అయితే, జమ్మూ కాశ్మీర్ లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీటి మట్టాలు పెరగడంతో గేట్లు ఎత్తేసినట్లు తెలుస్తోంది. ఉద్దేశపూర్వకంగా భారత్ ఈ చర్య చేపట్టలేదని తెలుస్తోంది. గేట్లు ఎత్తేయడంతో ఒక్కసారిగా వరద నీరు పాకిస్తాన్ వైపు వెళ్తోంది. ముఖ్యంగా, నదీ ఒడ్డున ఉన్న ముజఫరాబాద్, సియాల్ కోట్ సహా పలు ప్రాంతాలను వరద ముంచెత్తే అవకాశం ఏర్పడింది. ఇప్పటికే, భారత్ నీటిని ఒక అస్త్రంగా మార్చుకుందని పాకిస్తాన్ ఆరోపిస్తోంది. సింధు నది దాని ఉపనదుల నీటిని నిలిపివేయడం యుద్ధ చర్యతో సమానం అని పాకిస్తాన్ చెబుతోంది.

# కథన రంగంలో ఏఐ చిందులు




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అన్ని రంగాల్లోనూ ప్రవేశించింది. ఏఐ సినిమా పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. చిత్ర నిర్మాణంలోని ప్రతి అంశాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దుతుండడంతోపాటు సినిమాపై ప్రేక్షకుల అంచనాలను పెంచుతోంది. సృజనాత్మక ప్రక్రియలను మెరుగుపరచడం, వర్క్‌ఫ్లోలను ఆప్టిమైజ్ చేయడం, వీక్షకుల అనుభవాలను విశ్లేషించడం ద్వారా ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతోంది. కృత్రిమ మేధ సినిమా ప్రీ-ప్రొడక్షన్, ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్, ఆడియన్స్ ఇంటరాక్షన్‌ను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకుందాం. స్క్రిప్ట్ రైటింగ్, కాస్టింగ్, స్టోరీబోర్డింగ్.. వంటి ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఏఐ సాయం చేస్తోంది. స్క్రిప్ట్‌బుక్, ప్లాటగాన్ వంటి సాధనాలు స్క్రిప్ట్‌ను విశ్లేషించడానికి, బాక్సాఫీస్ పనితీరును అంచనా వేయడానికి, భావోద్వేగ అంశాలు, సంభాషణ ఆధారంగా కథలో మెరుగుదలను సూచించడానికి నేచురల్ ల్యాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్‌పీ)ను ఉపయోగిస్తున్నాయి. ఇది సినీ రచయితలు తమ కథలను మెరుగుపరచడానికి, నిర్మాతలు బడ్జెట్లను సమర్థవంతంగా కేటాయించడానికి సహాయపడుతుంది. కాస్టింగ్.ఏఐ వంటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌లు దర్శకులు ఎంచుకున్న పాత్రలకు వర్చువల్‌గా నటులను గుర్తించేందుకు వారి ముఖాల కవళికలను విశ్లేషిస్తుంది. స్టోరీబోర్డర్ వంటి ఏఐ ఆధారిత సాధనాలు స్క్రిప్ట్‌లను విశ్లేషించి విజువల్ డ్రాఫ్ట్‌లను అందిస్తాయి. ఇది దర్శకులు సన్నివేశాలను ముందుగానే విజువలైజ్ చేయడానికి, సినిమాను త్వరగా చిత్రీకరించడానికి సాయం చేస్తుంది.

### ప్రొడక్షన్

ప్రొడక్షన్ సమయంలో విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్), సినిమాటోగ్రఫీ, సెట్ డిజైన్లను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మారుస్తోంది. డాల్.ఈ, మిడ్‌జర్నీ వంటి జనరేటివ్ ఏఐ మోడల్స్ సినిమాలోని సన్నివేశాలకు అనుగుణంగా వర్చువల్‌గా వాస్తవికతను జోడిస్తున్నాయి. వీఎఫ్ఎక్స్‌లో ఏఐ రోటోస్కోపింగ్, మోషన్ క్యాప్చర్, డీ-ఏజింగ్(నటుల వయసు తగ్గినట్టు చూపడం) వంటి పనులను సులభతరం చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరా కదలికలను ఆటోమేట్ చేస్తుంది. సీన్ ఆధారంగా లైటింగ్ సెటప్‌లను సూచించడం ద్వారా సినిమాటోగ్రఫీని మెరుగుపరుస్తుంది.

### పోస్ట్ ప్రొడక్షన్

ఎడిటింగ్, కలర్ గ్రేడింగ్, సౌండ్ డిజైన్లను ఆటోమేట్ చేయడం ద్వారా ఏఐ పోస్ట్ ప్రొడక్షన్‌ను క్రమబద్ధీకరిస్తుంది. అడోబ్ ప్రీమియర్ ప్రో ఆటో రిఫ్రేమ్ వంటి సాధనాలు ఇందుకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. కృత్రిమ మేధ సాధనాలు రా-ఫుటేజీని విశ్లేషిస్తాయి. కీలక దృశ్యాలను గుర్తిస్తాయి. సరైన విధంగా ఎడిట్ చేస్తాయి. ఐజోటోప్ ఆర్ఎక్స్ వంటి ఏఐ సాధనాలు బ్యాగ్రౌండ్ సౌండ్‌ను తొలగిస్తాయి. వాస్తవిక సౌండ్ ఎఫెక్ట్స్‌ను క్రియేట్ చేస్తాయి. వాయిస్ఓవర్లను మెరుగుపరుస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డబ్బింగ్ ప్లాట్‌ఫామ్‌లు సహజసిద్ధమైన ట్రాన్స్‌లేషన్‌లను అందిస్తాయి. ఇది ప్రపంచంలోని ప్రేక్షకులకు సినిమాను మరింత అందుబాటులోకి తెస్తున్నాయి.

### డిస్ట్రిబ్యూషన్ అండ్ మార్కెటింగ్

సినిమాను ఎలా మార్కెటింగ్ చేయాలి.. ఎలా డిస్ట్రిబ్యూషన్ చేయలనే అంశాలను ఏఐ పునర్నిర్మిస్తోంది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల్లో వ్యూయర్‌షిప్‌ను విశ్లేషించడానికి ఏఐ అల్గారిథమ్‌లు ఉపయోగపడుతున్నాయి. వ్యక్తిగత వినియోగదారుల కోసం తగిన ట్రైలర్లు, పోస్టర్లను సృష్టిస్తున్నాయి. ప్రమోషన్‌లో భాగంగా జానర్ ప్రాధాన్యతలు లేదా ఇష్టమైన నటుల ఆధారంగా నిర్దిష్ట ప్రేక్షకులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. డిస్ట్రిబ్యూషన్‌లో భాగంగా ఏఐ టూల్స్ మార్కెట్ పోకడలు, సోషల్ మీడియా సెంటిమెంట్, చారిత్రాత్మక డేటాను విశ్లేషించి విడుదల తేదీలను సూచిస్తున్నాయి. దీంతోపాటు పైరసీని ఎదుర్కోవటానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయపడుతుంది.

### ఆడియన్స్ ఎంగేజ్‌మెంట్

ఇంటరాక్టివ్ ఫార్మాట్లను రూపొందించడం ద్వారా సినిమాపై ప్రేక్షకుల అభిప్రాయాలు తెలుసుకునే వీలుంటుంది. ఏఐ ఆధారిత వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) వంటివి ప్రేక్షకులను సినిమాకు మరింత దగ్గర చేస్తున్నాయి. ఏఐ సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకుల ఫీడ్ బ్యాక్‌ను విశ్లేషిస్తుంది. మార్కెటింగ్ వ్యూహాలను మెరుగుపరచడంలో స్టూడియోలకు సహాయపడుతుంది.

### సవాళ్లు లేవా..?

ఏఐ సినిమాకు అపారమైన సామర్థ్యాన్ని అందిస్తుండగా, నైతిక, సృజనాత్మక ఆందోళనలను కూడా లేవనెత్తుతుంది. డీప్‌ఫేక్ టెక్నాలజీ అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో అనుమతి లేకుండా నటుల పోలికలు లేదా స్వరాలను కాపీ కొట్టేలా కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నారు. సినిమా పరిశ్రమలోని క్రియేటివ్ ఉద్యోగులకు ఏఐ ముప్పుగా మారుతోంది. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్, ఎడిటింగ్‌లో ఎంట్రీ లెవల్ ఆర్టిస్టులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంది. ఏఐ ఆటోమేటెడ్ ఎడిటింగ్ వల్ల సన్నివేశాల్లోని భావోద్వేగాలు కోల్పేయే ప్రమాదం కూడా ఉంది. ఏదేమైనా ఏఐ చాలా వరకు సినీ ప్రపంచంలో ఇప్పటికీ పాగా వేసింది. ఏ రంగంలోనైనా ఏఐ ప్రభావం కొంత వరకే ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్రియేటివ్ పరిశ్రమలో నిత్యం చేసే పనులను మాత్రమే ఏఐతో ఆటోమేట్ చేయవచ్చని చెబుతున్నారు. సృజనాత్మకంగా ఆలోచించి, మంచి సన్నివేశాలకు ప్రాధాన్యత ఇస్తూ కళామతల్లిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఏఐ కంటే మానవులపైనే అధికంగా ఉందంటున్నారు.

# సాంకేతికతతో యుద్ధానికి సై



సాంకేతిక పరిజ్ఞానం అన్ని రంగాల్లో వేగంగా విస్తరిస్తోంది. అందుకు యుద్ధ భూమి ఏమీ అతీతం కాదు. శత్రువులపై యుద్ధం సాధించేందుకు, స్పష్టమైన ఫలితాల కోసం టెక్నాలజీ వాడుతున్నారు. ఇందులో భాగంగా మానవరహిత ఆయుధాలు, సైబర్ వార్ఫేర్, డ్రోన్లు, రోబోటిక్స్, అన్ మ్యాన్డ్ అడ్వాన్స్‌డ్ వెపన్స్.. వంటి చాలా పరికరాల్లో సాంకేతికతను వినియోగిస్తున్నారు. కృత్రిమమేధ వాడకం పెరుగుతున్న ఈ రోజుల్లో రణరంగంలో టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగిస్తున్నారో తెలుసుకుందాం.

### ఏఐ, మెషిన్ లెర్నింగ్

యుద్ధ సమయాల్లో నిర్ణయాలు తీసుకోవడం, ప్రక్రియలను ఆటోమేట్ చేయడం, ఇంటెలిజెన్స్ విశ్లేషణను మెరుగుపరిచేందుకు కృత్రిమ మేధ సాయం తీసుకుంటున్నారు. యుద్ధరంగంలో ఇది విప్లవాత్మక మార్పులు తెస్తోంది. శత్రువుల కదలికలను అంచనా వేయడానికి లేదా వ్యూహాత్మక లక్ష్యాలను గుర్తించడానికి ఏఐ విస్తారమైన డేటాసెట్లను ప్రాసెస్ చేస్తుంది. అటానమస్ విధానం ద్వారా డ్రోన్లు, వాహనాలకు ఏఐ సామర్థ్యాలు జోడిస్తున్నారు. ఇది మానవ ప్రమేయం లేకుండా రియల్ టైమ్ డెసిషన్ మేకింగ్‌కు వీలు కల్పిస్తుంది. సైబర్ బెదిరింపులను గుర్తించి సమర్థంగా కట్టడి చేసేందుకు మెషిన్ లెర్నింగ్ తోడ్పడుతుంది. కీలకమైన మౌలిక సదుపాయాలను రక్షిస్తుంది.

### మానవ రహిత వ్యవస్థలు (డ్రోన్లు, రోబోటిక్స్)

యుద్ధంలో మానవ రహితవ్యవస్థలు అనివార్యంగా పెరుగుతున్నాయి. ఇది సైనికులు ప్రాణాలు కోల్పోవడాన్ని తగ్గిస్తుంది. ఇందులో డ్రోన్లు కీలకంగా మారుతున్నాయి. ఏరియల్ డ్రోన్లను నిఘా, దాడుల్లో కచ్చితత్వం కోసం ఉపయోగిస్తున్నారు. అమెరికా ఆర్మీకి చెందిన స్మాల్ అన్‌మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్ (ఎస్‌యూజీవీ) వంటి రోబోలు బాంబుల తొలగింపును నిర్వహిస్తున్నాయి. మానవరహిత అండర్ వాటర్ వెహికల్స్ (యూయూవీ) మైన్ డిటెక్షన్, సబ్ మెరైన్ ట్రాకింగ్ పనులు చేస్తున్నాయి.

### సైబర్ వార్‌ఫేర్ టెక్నాలజీ

యుద్ధ సమయంలో కమ్యూనికేషన్లు, ఆర్థిక వ్యవస్థలు, ఇతర రక్షణ వ్యవస్థలకు అంతరాయం కలిగించేలా సైబర్ దాడులు నిర్వహించే అవకాశం ఉంది. వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు సైబర్ వార్‌పేర్ డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. ఇందులో భాగంగా మాల్వేర్, హ్యాకింగ్ టూల్స్ ద్వారా ప్రభుత్వ ప్రాయోజిత వెబ్‌సైట్‌ల్లోని సమాచారం శత్రు దేశాల్లోని నెట్‌వర్క్‌లోకి వెళ్లకుండా అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. దాంతోపాటు ఏఐ ఆధారిత సైబర్ సెక్యూరిటీ ద్వారా మిలిటరీ నెట్‌వర్క్‌లను రక్షిస్తున్నారు.

### అధునాతన ఆయుధాలు

ఆధునిక ఆయుధాల ద్వారా ప్రమాద పరిధి పెరుగుతుంది. రష్యాకు చెందిన కింజాల్ అనే హైపర్ సోనిక్ ఆయుధాలు లేదా చైనాకు చెందిన డీఎఫ్-జెడ్ ఎఫ్ వంటి క్షిపణులు సంప్రదాయ రక్షణ వ్యవస్థల నుంచి వెంటనే తప్పించుకుంటాయి. లేజర్లు, మైక్రోవేవ్ వ్యవస్థలు డ్రోన్లు లేదా క్షిపణులను కచ్చితత్వంతో నిలిపివేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. జీపీఎస్ గైడెడ్ బాంబులు నిర్దిష్ట లక్ష్యాన్ని చేదిస్తాయి.

### శాటిలైట్ అండ్ స్పేస్ టెక్నాలజీస్

సైనిక కార్యకలాపాలకు అంతరిక్షం కీలకమైన డొమైన్‌గా మారింది. నిఘా ఉపగ్రహాలతో రియల్ టైమ్ ఇమేజ్‌లు, ప్రత్యేకంగా సిగ్నలింగ్ సదుపాయాలను పొందుతున్నారు. దళాల కదలికల కోసం జీపీఎస్, నావిగేషన్‌ను వాడుతున్నారు. కమ్యూనికేషన్లకు అంతరాయం కలిగించే శత్రు ఉపగ్రహాలను నిలిపివేయడానికి లేదా నాశనం చేయడానికి యాంటీ శాటిలైట్ వెపన్స్ రూపొందిస్తున్నారు.

# అనారోగ్యాన్ని 'కొని' తెచ్చుకోవద్దు!



మండు వేసవికాలం. రంగురంగుల మామిడి పండ్లతో మార్కెట్లు కళకళలాడు తుంటాయి. "పళ్లల్లో రారాజు" అని ముద్దుగా పిలుచుకునే ఈపండు కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. అయితే, ఈమధ్యకాలంలో "అంతా మాయాబజార్" అన్న చందంగా, సహజ సిద్ధంగా కాకుండా కృత్రిమ పద్ధతుల్లో మామిడి పండ్లను త్వరగా పండించేస్తున్నారు. ఇలాంటి "పైపూతలు" పూసిన పండ్ల వల్ల ప్రజల ఆరోగ్యం ఆగమవుతున్నదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్కెట్‌కు వచ్చిన మామిడి పండ్లు మంచివా? లేదంటే కృత్రిమంగా పండించినవా? వాటిని ఎలా గుర్తించాలన్న విషయంలో ప్రజలకు సరైనఅవగాహనలేదు. దీంతో అనారోగ్యాన్ని 'కొని'తెచ్చుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బంగనపల్లి, నీలం, రసం, తోతాపురి, బేనిషన్ వంటి రకాలకు మంచి పేరుంది. కానీ, నాసిరకం పండ్లను గుర్తించక అనారోగ్యం బారినపడుతున్నారు. మామిడి కాయలను "నిమిషాల్లో నిప్పులు కక్కేలా" పండించడానికి వ్యాపారులు ఎక్కువగా వాడుతున్న రసాయనం కార్బైడ్, దీనినే కాల్షియం కార్బైడ్ అని కూడా అంటారు. ఇది చూడటానికి పైకి మెత్తగా లోపల వెన్నపూస అన్నట్లు తెల్లగా లేదా బూడిద రంగులో ఉంటుంది. ఈ కార్బైడ్‌ను మామిడి కాయల మధ్యలో పెట్టి నీళ్లు చల్లితే చాలు, అగ్గి రాజుకున్నట్టు ఎసిటిలీన్ అనే వాయువు విడుదలవుతుంది. ఇది సహజంగా పండ్లు పండడానికి కారణమయ్యే ఇథిలీన్ వాయువును పోలి ఉన్నప్పటికీ, అసలు సిసలైంది కాదు, అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. కొంతమంది వ్యాపారులు తక్కువ ఖర్చు ఎక్కువ లాభం అనే సూత్రంతో నిషేధిత రసాయనమైన ఇథిఫోన్‌ను కూడా అధిక మోతాదులో వాడుతున్నారు. ఈ రసాయనాన్ని మామిడి పండ్లు ముగ్గేందుకు ప్రత్యక్షంగా ఉపయోగిం చడానికి అనుమతి లేదు. ఇది కూడా ఇథిలీన్‌ను విడుదల చేస్తుంది, కానీ దీని అధిక వినియోగం పండ్ల నాణ్యతనుమట్టి కొట్టేలా చేస్తుంది,

ఆరోగ్యానికి 'చేటు చేస్తుంది. ఇథిఫోన్‌ను పొడి రూపంలో చిన్న సాచెట్‌లలో ప్యాక్ చేసి పండ్లతో నేరుగా సంబంధం లేకుండా ఉపయోగించవచ్చు. ఈ సాచెట్‌లు ఇథిలీన్ గ్యాస్‌ను విడుదల చేస్తాయి. తద్వారా పండ్లు పండుతాయి. అయితే, ఇథిఫోన్‌ను నేరుగా పండ్లపై చల్లడం లేదా అధిక మోతాదులో ఉపయోగించడం ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నిబంధనలకు విరుద్ధం. ఎఫ్ఎస్ఎస్ఎఐ చట్టాల ప్రకారం కాకుండా విరుద్ధంగా వీటిని వాడితే "మూల్యం చెల్లించక తప్పదు". ఈ విషయంలో కోర్టులు కూడా కాల్షియం కార్బైడ్ వాడకాన్ని తీవ్రంగా పరిగణించాయి. ఢిల్లీ హైకోర్టు దీన్ని విషం ఇవ్వడం తో సమానమని "తీర్పు చెప్పింది". ఇతర రాష్ట్రాల కోర్టులు కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాయి. కార్బైడ్, ఇథిఫోన్ వంటివాటితో పండించిన మామిడి పండ్లను తింటే ఆరోగ్యం గుల్లనే అవుతుంది. కార్బైడ్‌లో ఆర్సెనిక్, ఫాస్పరస్ వంటి విషపు కుంపట్లు ఉంటాయి. వీటి ప్రభావంతో తలనొప్పి, కళ్లు తిరగడం, వికారం, వాంతులు, కడుపు నొప్పి, అతిసారం వంటి సమస్యలు చుట్టుముడతాయి. దీర్ఘకాలికంగా ఇది నాడీ వ్యవస్థను కుప్పకూల్చే ప్రమాదం ఉంది. గర్భిణులు, పిల్లలపై దీని ప్రభావం ఉంటుంది. ఇంకా చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కడుపులో మంట వంటి ఇబ్బందులు కూడా ఉంటాయి. ఇది కాలేయం, మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది. దీన్ని గుర్తించేదెలా?అన్న సందేహం ఎవరికైనా వస్తుంది. సహజంగా పండిన పండ్లు ఒకే రంగులా ఉండదు, అక్కడక్కడ కొద్దిగా ఆకుపచ్చగా ఉంటాయి. కృత్రిమంగా పండించినవి మాత్రం మెరుగు పెట్టినట్టు ఒకే రంగులో మెరిసిపోతుం టాయి. సహజ పండ్లకు నోరూరించే తీయటి వాసన ఉంటుంది, కానీ వీటికి అంత వాసన ఉండదు, లేదా రసాయనాల ముక్కు చీదుకునే వాసన వస్తుంది. సహజ పండ్లు మెత్తగా ఉంటే, కృతిమపండ్లు పైకి మెత్తగా ఉన్నా లోపల రాయిలా గట్టిగా ఉంటాయి. కొన్నిసార్లు వాటిపై నల్లటి మచ్చలు కూడా కనిపిస్తాయి.రుచిలో కూడా తేడా ఉంటుంది, సహజ పండ్లు పూర్తిగా తియ్యగా ఉంటే, వీటికి రుచి అంతగా ఉండదు లేదా పుల్లగా అనిపించవచ్చు. ఒకవేళ మీరు పొర పాటున ఇలాంటి పండ్లను కొంటే, వాటిపై ఉండే రసాయనాలను కొంత వరకు తగ్గించడానికి నీటితో బాగా కడగడం, ఉప్పు నీటిలో, వెనిగర్ లేదా బేకింగ్ సోడా ద్రావణంలో నానబెట్టడం వల్ల ఉపరి తలంపై ఉండే రసాయనాలు కొంత వరకు పనిచేస్తా యి. కానీ పూర్తిగా తొలగించలేమన్నది గుర్తుంచు కోవాలి. అధికారులు కూడా కృత్రిమపండ్లు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మార్కెట్లలో విరివిగా నాణ్యత పరీక్షలు చేయాలి.ప్రజలకు కూడా సరైన అవగాహన కల్పించాలి. ఇది ప్రభుత్వాల బాధ్యతగా భావించాలి.

## పేర్లు రాసుకొని పెట్టుకోండి.. ఎవ్వరినీ వదలం.. సప్త సముద్రాల అవతల ఉన్నా విడిచిపెట్టం..!



**అమరావతి,:** ఎవ్వరినీ వదలం.. ఎక్కడున్నా.. కార్యకర్తల్ని ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి అని సూచించారు వైఎస్ జగన్.. వైసీపీ కేంద్ర కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం, శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ, పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ ఛైర్ పర్సన్లు, మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో పాటు ఆయా జిల్లాల ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ అయిన వైఎస్ జగన్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మీ బాధలు చూస్తున్నాను.. హామీ ఇస్తున్నాను.. కేవలం వైసీపీని ప్రేమించినందుకు, పార్టీని అభిమానించినందుకు కార్యకర్తలు పడుతున్న బాధను చూశాను.. అందుకే జగన్ 2.0 లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాను. వారికి పూర్తి న్యాయం చేస్తాను.. ఎవ్వరినీ వదలం.. ఎక్కడున్నా.. కార్యకర్తల్ని ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి.. అధికారంలోకి వచ్చాక వారిని చట్టం ముందు నిలబెడదామని హెచ్చరించారు. ఈరోజు చంద్రబాబు, పోలీసులు చేస్తున్న దుర్మార్గం.. వారు ఏదైతే విత్తనం వేస్తున్నారో రేపు అదే పెరుగుతుందన్నారు జగన్.. అందుకే ఈరోజు దౌర్జన్యాలు చేస్తున్న అధికారులు, పోలీసులు.. ఆరోజు ఎక్కడున్నా, రిటైర్ అయినా, సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టం.. అది మామూలుగా ఉండదు అని వార్నింగ్ ఇచ్చారు.. పశ్నించకూడదని నిరంకుశత్వం, డైవర్షన్.. ఈరోజు తప్పుడు కేసులు, తప్పుడు సాక్ష్యాలు. సంబంధం లేకున్నా కేసుల్లో ఇరికిస్తున్నారు.. ఇలాంటి రాజకీయాలు గతంలో ఏనాడూ చూడలేదు.. చంద్రబాబు ఇవన్నీ ఎందుకు చేస్తున్నాడంటే, ఆయన ప్రజల్లో చులకన అయ్యారు. హామీలు అమలు చేయడం లేదు. దీంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది.. ఎవరూ ప్రశ్నించకూడదని, రాష్ట్రంలో భయానక పరిస్థితి సృష్టిస్తున్నాడని పేర్కొన్నారు.. ఎక్కడ ఏ సమస్య వచ్చినా, ప్రజల్లో వ్యతిరేకత కనిపించినా, వెంటనే డైవర్షన్. ఒకరోజు తిరుపతి లడ్డూ అంటాడు. ఇంకోరోజు సినీ నటి కేసు అంటాడు.. వారికి ప్రజల్లో వెళ్లే ధైర్యం లేదు.. ప్రజలు అడిగే ప్రశ్నలకు చంద్రబాబు సమాధానం చెప్పలేడు. టీడీపీ వారు ఎక్కడికి వెళ్ళినా.. ఏం జరుగుతుంది.. నా 15 వేలు ఏమయ్యాయని పిల్లలు, మా 26 వేలు ఏమయ్యాయని రైతులు, అవ్వలు వారి 48 వేలు, యువత తమ 36 వేలు ఏమయ్యాయని అడుగుతారు.. ఎన్నికల ముందు మాట ఇచ్చి, మోసం చేయడంతో సమాధానం చెప్పలేని దుస్థితి. అన్ని వ్యవస్థలు నాశనం. నిర్వీర్యం చేశారని మండిపడ్డారు వైసీపీ అధినేత వైఎస్ జగన్..

## కరాచీ, లాహెూర్, రావల్పిండి సహా 9 ప్రాంతాల్లో భారత్ డ్రోన్ దాడులు: పాక్ ఆర్మీ..



**న్యూఢిల్లీ,:** భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్ ఆర్మీ సంచలన ఆరోపణలు చేసింది. ఈ రోజు ఉదయం పాకిస్తాన్ లాహెూర్‌తో పాటు ఇతర నగరాల్లో పేలుడు శబ్దాలు వినిపించడంతో ఒక్కసారికి పాక్ ప్రజల్లో వణుకు పట్టింది. భారత్ మళ్లీ దాడి చేస్తుందా..? అనే అనుమానాలు పాక్ ప్రజలు వ్యక్తపరిచారు. అయితే, తాజాగా పాక్ ఆర్మీ మీడియా విభాగం ఐఎస్‌పీఆర్ సంచలన ఆరోపణలు చేసింది. ఈ పేలుళ్లకు భారత్ కారణమని ఆరోపించింది. తాము ఇండియాకు చెందిన 12 డ్రోన్లను కూల్చామని పాక్ ఆర్మీ చెబుతోంది. పాకిస్తాన్‌లోని కరాచీ, లాహెూర్, రావల్పిండి, గుజ్రాన్‌వాలా, అటాక్, బహవల్పూర్ వంటి నగరాలపై డ్రోన్ అటాక్స్ జరిగాయని ఐఎస్‌పీఆర్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి ఆరోపించారు. డ్రోన్ దాడుల తర్వాత కిస్తాన్ విమానాశ్రయాల అథారిటీ కరాచీ, లాహెూర్, ఇస్లామాబాద్, ఫైసలాబాద్ మరియు సియాల్‌కోట్ ప్రధాన విమానాశ్రయాలలో విమాన కార్యకలాపాలను నిరవధికంగా నిలిపివేసినట్లు పాక్ మీడియా వెల్లడించింది. విమానయాన అధికారులు "నోటీస్ టు ఎయిర్‌మెన్" ద్వారా అన్ని విమానయాన సంస్థలకు దీని గురించి తెలియజేశారు. పాక్ మీడియా ప్రకారం, లాహెూర్‌కు వచ్చే అన్ని విమానాలను కరాచీ విమానాశ్రయానికి మళ్లించారు, ఇందులో జెడ్డా, దుబాయ్, మస్కట్, షార్జా మరియు మదీనా నుండి వచ్చే విమానాలు కూడా ఉన్నాయి. ముందు జాగ్రత్త చర్యగా లాహెూర్‌లోని అల్లామా ఇక్బాల్ అంతర్జాతీయ విమానాశ్రయం, సియాల్‌కోట్ విమానాశ్రయాలను ఖాళీ చేయించారు. కరాచీ జిన్నా విమానాశ్రయం కూడా మూసి వేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, గురువారం ఉదయం, లాహెూర్‌లోని వాల్టన్ రోడ్ మరియు పరిసర ప్రాంతాల్లో ఒకదాని తర్వాత ఒకటి మూడు పెద్ద పేలుళ్లు వినిపించాయి, దీనితో భయాందోళనలు చెలరేగాయి మరియు ప్రజలు భయంతో ఇళ్ల నుండి బయటకు వచ్చారు. మూడు పేలుళ్లు కొన్ని సెకన్లలోనే జరిగాయని, వాటి శబ్దాలు అనేక కిలోమీటర్ల దూరం వినిపించాయని లాహెూర్ పోలీసులు తెలిపారు.

## జైపూర్‌లో హైఅలర్ట్.. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంకు బాంబు బెదిరింపు





**న్యూఢిల్లీ,:** ఆపరేషన్ సింధూర్' విజయంతో దేశమంతా ఉత్సాహంగా ఉన్న వేళ, రాజస్థాన్‌లోని జైపూర్‌లో మాత్రం భయానక వాతావరణం నెలకొంది. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో బాంబు పెట్టినట్లు బెదిరింపు మెయిల్ రావడంతో నగరంలో హై అలర్ట్ ప్రకటించారు.రాజస్థాన్ రాష్ట్ర క్రీడా మండలికి ఈ బెదిరింపు సందేశం మెయిల్ ద్వారా ఉదయం 9:13 గంటల ప్రాంతంలో అందింది. "ఆపరేషన్ సింధూర్ విజయానికి గుర్తుగా మీ స్టేడియంలో బాంబు పేలుస్తాం" అంటూ ఆ మెయిల్‌లో హెచ్చరించడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ ఘటన, భారత సాయుధ దళాలు పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాదాపు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఒక రోజు తర్వాత చోటుచేసుకుంది. కేవలం 25 నిమిషాల వ్యవధిలో, భారత్ బాలాకోట్ తర్వాత అతిపెద్ద సరిహద్దు దాటి దాడులను నిర్వహించింది. 'ఆపరేషన్ సింధూర్' పేరుతో జరిగిన ఈ మెరుపు దాడుల్లో వైమానిక, నావికా , భూతల దళాలు పాల్గొన్నాయి. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మంది పౌరులను బలిగొన్న ఉగ్రదాడికి ప్రతీకారంగా చీకటిలో ఈ ఆపరేషన్ జరిగింది. అగ్రశ్రేణి వర్గాల సమాచారం ప్రకారం, నిషేధిత జైషే మహ్మద్ , లష్కరే తోయిబా , హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన దాదాపు 100 మంది ఉగ్రవాదులు ఈ ఖచ్చితమైన దాడుల్లో హతమయ్యారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగానే ఈ లక్ష్యాలను ఎంపిక చేశామని ప్రభుత్వం ఒక విలేకరుల సమావేశంలో తెలిపింది. బెదిరింపు మెయిల్ రాగానే జైపూర్ పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం చుట్టుపక్కల భారీగా పోలీసు బలగాలను మోహరించారు. స్టేడియం లోపల ఉన్న వారందరినీ తక్షణమే బయటకు పంపించివేశారు. అంతేకాకుండా, స్టేడియం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న వారిని కూడా ఖాళీ చేయించారు. బాంబు స్క్వాడ్‌లు స్టేడియం లోపల , వెలుపల క్షుణ్ణంగా గాలిస్తున్నారు. నగరంలో భయాందోళనలు నెలకొన్నప్పటికీ, పోలీసులు ప్రజలకు ధైర్యం చెబుతూ భద్రతా చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఈ బెదిరింపు వెనుక ఎవరున్నారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 'ఆపరేషన్ సింధూర్' విజయం తర్వాత దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ ఘటన మరింత ఆందోళన కలిగిస్తోంది.

# అదనుచూసి పదునైన పాఠం!




తీరికూర్చుని భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో జగడాలమారి పాకిస్తాన్‌కూ, దాని కీలుబొమ్మలైన ఉగ్రమూకలకూ తెలిసొచ్చి ఉండాలి. 2016 నాటి 'ఉరి' సర్జికల్ దాడులు, 2019 నాటి బాలాకోట్ వైమానిక దాడులకు అనేక రెట్లు అధికంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక 'ఆపరేషన్ సిందూర్' సంకేతనామంతో మన త్రివిధ దళాలు పకడ్బందీ సమన్వయంతో పాకిస్తాన్‌లోనూ, ఆక్రమిత కశ్మీర్ లోనూ తొమ్మిది చోట్ల గంటసేపు సాగించిన క్షిపణి దాడులు పాక్ సైన్యాన్నీ, ఉగ్రమూకల్నీ గుక్క తిప్పుకోనీయకుండా చేశాయి. ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలూ, వారి ఆయుధ గిడ్డంగులూ, ఇతరేతర అవసరాలకు వినియోగిస్తున్న బహుళ అంతస్తుల భవంతులూ లక్ష్యంగా మొత్తం 24 చోట్ల సాగించిన దాడుల్లో 70 మంది వరకూ ఉగ్రవాదులు మరణించగా, మరో 60 మంది గాయపడ్డారని చెబుతున్నారు. ఉగ్రవాద ముఠాలైన జైషే మొహమ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా(ఎల్ఈటీ) ప్రధాన కార్యాలయాలు రెండూ కుప్పకూలాయని సమాచారం. జేఈఎం చీఫ్ మసూర్ అజర్ సోదరితోసహా అతగాడి కుటుంబానికి చెందిన పదిమంది హతమయ్యారని కూడా చెబుతున్నారు. జరిగిన నష్టాన్ని కప్పెట్టే ఎత్తుగడతో అయిదు భారత్ విమానాలను కూల్చామంటూ పాక్ స్వోత్కర్షలకు పోతోంది. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి పాక్ లోలోపలివరకూ చొచ్చుకెళ్లి దాడులు సాగించిన తీరూ, ఒక్క క్షిపణి కూడా గురితప్పకుండా శత్రుమూకలపై చంద్రనిప్పులు కురిపించిన విధానం మన త్రివిధ దళాల పకడ్బందీ అంచనాలకూ, పదునైన వ్యూహచతురతకూ దర్పణాలు. పాక్ గడ్డపై గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఉగ్రశిబిరాల ఆనుపానుల్ని శత్రునేత్రానికి చిక్కని విధంగా గత పక్షం రోజులుగా మానవ రహిత విమానాలతో జల్లెడపట్టాకే ఈ దాడులు జరిగాయి. పహల్‌గామ్ సమీపంలో అకారణంగా, అన్యాయంగా నిరాయుధ భారత పౌరులను గురిచూసి కాల్చిచంపటానికి కిరాయిమూకల్ని పంపి కొన్నిరోజులుగా పాకిస్తాన్ మురుస్తోంది. దీనిపై నిలదీస్తే షరా మామూ లుగా సాక్ష్యాలడుగుతోంది. గత నెల 22న పహల్‌గామ్ సమీపంలో ఉగ్రవాద ముఠా 26 మందిని పొట్టనబెట్టుకున్నప్పటి నుంచీ భారత ప్రజ ప్రతీకారంతో రగిలిపోతోంది. కంటికి కన్ను సిద్ధాంతం పాటించి గట్టి దెబ్బతీయాల్సిందేనన్న అభిప్రాయం అలుముకుంది. ఈ నేపథ్యంలో మన దళాల దాడులు విజయవంతం కావటం అందరినీ సాంత్వన పరుస్తుందనటంలో సందేహం లేదు. అనుకోని పరిణామాలు తలెత్తితే అనుసరించాల్సిన పద్ధతులపై పౌరులకు అవగాహన కల్పించటానికి బుధవారం మాక్ డ్రిల్ జరగటం, అంతకుముందు రోజు రాత్రే మన త్రివిధ దళాలు దాడులు చేయటం గమనిస్తే వర్తమానం ఎంత జటిలంగా ఉన్నదో అర్థమవుతుంది. ఇది మనం కోరుకున్నది కాదు. మన ప్రమేయం లేకుండా వచ్చిపడిన విపత్తు. అకారణంగా మనపై రుద్దిన సంక్లిష్ట సమస్య. దీనికి దీటుగా స్పందించకపోతే ఉగ్రదాడులకు అంతూ పొంతూ ఉండదు. కనుకనే పహల్‌గామ్ మారణకాండ గురించి తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ పర్యటనను రద్దుచేసుకుని వెను దిరిగారు. ఆ వెంటనే మంత్రివర్గ సహచరులతో, త్రివిధ దళాల అధిపతులతో వరస సమాలోచనలు సాగించారు. ఎప్పుడు, ఎక్కడ ఎలా దాడులు సాగించాలో, తీవ్రత ఏ స్థాయిలో వుండాలో మీరే నిర్ణ యించండంటూ మన దళాలకు అధికారం ఇచ్చారు. పర్యవసానంగానే పాక్ ప్రాపకంతో చెలరేగి పోతున్న ఉగ్రముఠాలకు గట్టి సమాధానం వెళ్లింది. ఈ దాడులకు చాలాముందే ఇతరేతర నిర్ణ యాలు తీసుకున్నారు. సింధూ నదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపేస్తున్నట్టు ప్రకటించ టంతోపాటు ఇండియా పలు చర్యలు తీసుకుంది. దీన్నంతటినీ గమనిస్తున్నవారికి మన దేశం సైనిక చర్యకు కూడా వెనకాడబోదని పక్షం రోజుల క్రితమే అర్థమైంది. యుద్ధం దేనికీ పరిష్కారం కాకపోవచ్చు. చర్చలే అంతిమంగా ఎంతటి జటిల సమస్యనైనా పరిష్కరిస్తాయన్న సిద్ధాంతం కూడా సరైనదే కావొచ్చు. కానీ పొరుగు పచ్చగావుంటే ఓర్వలేక నిష్కారణంగా దాడులకు దిగే నైజాన్ని శాంతిప్రవచనాలతో ఎదుర్కొనటం సాధ్యమేనా? ఒకపక్క పహల్‌గామ్ దాడులతో సంబంధం లేదంటూనే గత కొన్ని రోజులుగా అధీనరేఖ వద్దా, అంత ర్జాతీయ సరిహద్దు వద్దా పాక్ ఎలాంటి కవ్వింపూ లేకుండా కాల్పులకు దిగుతోంది. ఈ దాడుల కారణంగా ఒక్క బుధవారంనాడే పూంఛ్ జిల్లా గ్రామాల్లో 12 మంది పౌరులు బలయ్యారు. తన దుష్ట పన్నాగాలను కప్పిపుచ్చటానికి భద్రతామండలిలో పాకిస్తాన్ అమాయకత్వం నటిస్తూ భారత్ తీసు కుంటున్న వరస చర్యలకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలని విఫలయత్నం చేసింది. రేపో మాపో అది నేరుగా సైన్యాన్ని రంగంలోకి దించి ప్రతీకారం పేరిట చెలరేగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఉగ్రముఠాల ద్వారా మారణహోమానికి పాల్పడటం కన్నా ఒకరకంగా ఇది మంచిదే. భారత్ బెదిరిపోయి సైనిక దాడుల ఆలోచన మానుకుంటుందన్న తప్పుడు ఆలోచనతో కొన్ని రోజులుగా అది అణుబాంబు బెదిరింపులకు కూడా తెగించింది. ఆ దుస్సాహసానికి పూనుకుంటే చేజేతులా స్వీయవినాశనాన్ని కొనితెచ్చుకున్నానని పాక్ పశ్చాత్తాపపడే రోజు ఎంతో దూరంలో ఉండదు. ఈ కష్టకాలంలో దేశ ప్రజానీకం కుల మత భేదాలు మరిచి కలిసికట్టుగా ఉండటం అత్య వసరం. ఇదే అదనుగా నాలుగు ఓట్ల కోసమో, మరికొన్ని సీట్ల కోసమో ప్రజల్లో వైషమ్యాలు సృష్టించాలని చూసే అవాంఛనీయ శక్తుల్ని అందరూ సకాలంలో పోల్చుకుని దూరం పెట్టడం, తగిన బుద్ధి చెప్పటం ఎంతో అవసరం. మనలోని సమష్టితత్వమే ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనే ధైర్యాన్ని స్తుంది. విజయాన్ని మన చేతికందిస్తుంది.

# రవీంద్రుడు.. దేశభక్తి పరాయణుడు



ఒక కలం, ఒక గళం, ఒక పదమై, ఒక పాటై, ఒక సంగీతమై, కవిత్వమై, రచనా వ్యాసంగమై కేవలం వంగ భూమినే కాకుండా యావత్ భారతాన్ని, ప్రపంచాన్ని అలరించింది. రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సాహితీ వినీలాకాశంలో ధ్రువతారగా నిలబెట్టింది. విశ్వకవిగా పేరుగడించిన రవీంద్రనాథ్ ఠాగూర్ బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించాడు. కవిగా, రచయితగా, సంఘసంస్కర్తగా బహుముఖ పాత్ర పోషించాడు. అనితర సాధ్యమైన ప్రజ్ఞాపాటవాన్ని ప్రదర్శించాడు. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా గళమెత్తాడు. బెంగాల్ పునరుజ్జీవన ఉద్యమంలో కీలక భూమిక పోషించాడు. భారతదేశానికి అర్థవంతమైన జాతీయ గీతం 'జనగణమన..' రచించాడు. బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని కూడా రవీంద్రుడు రచించాడు. ఎక్కడ ప్రతిభ ఉన్నా గుర్తించి గౌరవించడం వలన మన గొప్పదనం ప్రస్ఫుటమవుతుంది. మన వ్యక్తిత్వం సమాజానికి అవగతమవుతుంది. దురదృష్ట వశాత్తూ ఇలాంటి లక్షణాలు వర్తమాన సమాజంలో మచ్చుకైనా కానరావు. అహం స్వవినాశనానికి దారితీయడమే కాకుండా, సమాజ వికాసానికి కూడా అడ్డుకట్టగా మారుతుంది. ప్రజ్ఞాపాటవాలు స్వయం కృషితో మాత్రమే సిద్ధిస్తాయి. ఆసక్తి, పట్టుదల వలన అనితర సాధ్యమైన ప్రతిభ స్వంతమవుతుంది. ఎలాంటి కృషిలేకుండా వర్ధించిన విస్తరిలా ప్రతిభ మన ముంగిట వాలదు. ప్రతిభను ప్రపంచానికి వెల్లడి కాకుండా అడ్డుకోవడం వలన అంతిమంగా నష్టమే వాటిల్లుతుంది. ఇతరులలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం వలన సమాజానికి మేలు జరుగుతుంది. ప్రతిభకు ఎల్లలులేవు. భాషాభేదాలు అడ్డురావని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిరూపించాడు. బెంగాలీ భాష పట్ల అమితమైన అభిమానమున్నా, ఇతర భాషల్లోని సాహిత్యాన్ని ఆస్వాదించి, అభినందించి, భారతదేశాన్ని ప్రపంచ సాహితీ రంగంలో అగ్రపథంలో నిలిపిన రవీంద్రుడు విశ్వకవిగా విశేష ఖ్యాతినార్జించాడు. రవి గాంచని చోటును కవి గాంచునన్న నానుడిని నిజం చేసిన రవీంద్రుని ప్రతిభ అనన్యసామాన్యం. తన ఆలోచనలను కవిత్వీకరించి పాశ్చాత్య ప్రపంచానికి సైతం అందించిన ఘనత రవీంద్రునిదే. రవీంద్రుని బాల్యమంతా దాదాపుగా ఒంటరిగానే గడిచింది. సహజమైన విద్యకు అలవాటుపడ్డ రవీంద్రుడు స్వేచ్ఛయుతమైన, జ్ఞానసంపన్నమైన, భయం లేని నూతన ప్రపంచం కోసం పరితపించాడు. బాల్యంలోనే ఒక మంచి కవిగా, రచయితగా పేరు గడించాడు. విమర్శకుల ప్రశంసలు పొందాడు. శాంతి నికేతన్‌ను స్థాపించి, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాడు. గురువులకు, విద్యార్థులకు మధ్య అవ్యాజ్యమైన ఆత్మీయతలతో కూడిన వాతావరణాన్ని సృష్టించాడు. సాహిత్యం పట్ల, కళల పట్ల విద్యార్థులకు మక్కువ కలిగించాడు. రవీంద్ర నాథ్ ఠాగూర్ 'గీతాంజలి' విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. సాహిత్యంలో నోబెల్ బహుమతిని సంపాదించి పెట్టింది. భారతదేశంలోనే కాదు ఆసియాలో తొలి నోబెల్ బహుమతి గ్రహీతగా రవీంద్రునికి అవకాశం దక్కింది. 'గీతాంజలి' రవీంద్రుని సాహితీ వనంలో విరబూసిన మనోహరమైన కవితాకుసుమం. రవీంద్రుని కావ్య శైలికి, సహజత్వానికి, చైతన్యవంతమైన, అర్థవంతమైన ప్రపంచ నిర్మాణానికి 'గీతాంజలి' ఒక మచ్చుతునక. ప్రకృతిని ఆస్వాదిస్తూ, ప్రకృతి ఒడిలో ప్రశాంతమైన వాతావరణంలో పెరుగుతూ, పెద్దలను గౌరవిస్తూ, క్రమశిక్షణతో జ్ఞానాన్ని ప్రసాదించే చదువులను అభ్యసిస్తూ, సృజనాత్మకతను అలవరచుకుని రవీంద్రనాథ్ ఠాగూర్ బహుముఖ ప్రజ్ఞాపాటవాలను స్ఫూర్తిగా తీసుకుని, ఆయన ఆదర్శాలను దేశభక్తిని, మానవతావాదాన్ని పెంపొందించుకోవాలి. అదే విశ్వకవికి మన మందించే నిజమైన నివాళి.

# వేధింపులే దర్యాప్తు సంస్థల పనా?




విధి నిర్వహణలో దర్యాప్తు సంస్థల పాత్ర తరచూ వివాదాస్పదమవుతోంది. బాధ్యతాయుతంగా దర్యాప్తు చేపట్టి, నేరాలకు ముకుతాడు వేయడంలో కీలకపాత్ర పోషించవలసిన దర్యాప్తు సంస్థలు అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాస్తున్నాయని, పాలకుల చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్నాయని తరచూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విపక్ష పార్టీలు ఈ రకమైన ఆరోపణలు చేయడాన్ని అర్థం చేసుకోవచ్చు కానీ, ప్రజాస్వామికవాదులు, న్యాయస్థానాలు సైతం దర్యాప్తు సంస్థల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేయడం గమనించవలసిన విషయం. ఒకప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)పై మాత్రమే ఆరోపణలు ఉండేవి. కానీ, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ (ఐటి) వంటి సంస్థలకు కూడా ఈ మకిలి అంటింది. రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపునకు ఈ రెండూ కేంద్రం చేతిలో పావులుగా మారాయంటూ విమర్శలు రావడం పరిపాటిగా మారింది. తాజాగా చత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ కేసు విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వ్యవహార శైలిపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. 'మూడు చార్జిషీట్లు దాఖలయ్యాయి. మీరు నిందితుడిని కస్టడీలో ఉంచి శిక్షిస్తున్నారు. విచారణ ప్రక్రియనే శిక్షగా మార్చారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. సరైన ఆధారాలు సేకరించకుండా కొందరు వ్యక్తులపై అభియోగాలు మోపుతున్న తీరును విమర్శిస్తూ, ఎప్పుడూ ఇదే తీరంటూ ఈసడించింది. ఆమాటకొస్తే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను న్యాయస్థానాలు తప్పుపట్టడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది ఆగస్టులోనూ ఓ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇడిని తీవ్రస్థాయిలో మందలించింది. 'ఏ వ్యక్తి స్వేచ్ఛనూ హరించకూడదు. వ్యక్తి స్వేచ్ఛ అనేది ఒక నియమమే. దాన్ని కోల్పోవడమనేది మినహాయింపుగానే ఉండాలి. ఆ స్వేచ్ఛపై నియంత్రణ విధిస్తే అది చట్టబద్ధంగానే జరగాలి. బెయిలివ్వడానికి మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం రెండు షరతులు ఉన్నాయి. అంతమాత్రాన వ్యక్తి స్వేచ్ఛను హరించడమే ప్రమాణమని ఆ నిబంధన ఎక్కడా చెప్పలేదు' అని చీవాట్లు పెట్టింది. వ్యక్తులను అరెస్టు చేయడానికి, రోజుల తరబడి కస్టడీలో ఉంచడానికి మనీలాండరింగ్ చట్టం ఇడికి ఒక ఆయుధంగా మారిందనేది సర్వత్రా వినిపిస్తున్న విమర్శ. నిందితులను జైలుకు పరిమితం చేసేందుకు ఈ చట్టం ఉపయోగపడుతోందన్నది పలువురి అభియోగం. ఈ చట్టం కింద నమోదైన కేసులు ఎక్కువ కాలం పెండింగులో ఉంటున్న మాట వాస్తవమేనంటూ ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరే స్వయంగా అంగీకరించడం చట్టం అమలులోని లొసుగులను బహిర్గతం చేస్తోంది. మామూలు నేరాల్లో ఎవరిపైనైనా కేసు నమోదు చేస్తే ఎఫ్ఐఆర్ దాఖలు చేసి, దాన్ని సదరు వ్యక్తికి అందజేయడం తప్పనిసరి. ఇడి కేసుల్లో ఇలా ఇసిఐఆర్‌ను విడుదల చేస్తారు. కానీ దాన్ని నిందితులకు తప్పనిసరిగా ఇవ్వాలన్న నిబంధన మనీలాండరింగ్ చట్టంలో లేదు. పైగా ఈ చట్టం కింద ఇడి అధికారులు ఎవరికైనా సమన్లు పంపి విచారించే అధికారం ఉంటుంది. తాను సాక్షినో, ముద్దాయినో సదరు వ్యక్తికి తెలియదు. ఇలా ఇడి అధికారులకు అపరిమితమైన అధికారాలు కట్టబెట్టిన మనీలాండరింగ్ చట్టంవల్ల నిందితులకు బెయిల్ దొరకడం దుర్లభమవుతోందనే విషయం ఇప్పటికే అనేక కేసులలో రుజువైంది కూడా. ఈ చట్టంపై వెల్లువెత్తుతున్న విమర్శలను, దాఖలవుతున్న పిటిషన్లను గమనించిన సర్వోన్నత న్యాయస్థానం 2022లో ఈ చట్టం కింద ఇడికి తాను స్వయంగా దాఖలు పరచిన అధికారాలను పునస్సమీక్షించేందుకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేయడం తాజా పరిణామం. ఇరవైరెండేళ్ల క్రితం రూపొందిన ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం (పిఎంఎల్ఎ)2005 జూలైనుంచి అమలులోకి వచ్చింది. అయినా తొలినాళ్లలో ఈ చట్టం అంత ప్రభావవంతంగా అమలు కాలేదు. పిఎంఎల్ఎ కింద తొలి చార్జిషీటు 2012 లో దాఖలైందంటే దర్యాప్తు సంస్థ పనితీరు ఎంత నత్తనడకగా ఉండేదో అర్థం అవుతుంది. అయితే, 2014లో కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డాక, ఇడి దూకుడు పెరిగింది. వరుస కేసుల నమోదుతో ఆర్థిక నేరగాళ్ల గుండెల్లో గుబులు పుట్టించింది. అయితే, ఈ దూకుడు వెనక అప్పటి కేంద్రంలోని పెద్దల హస్తం ఉందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ చట్టంలో లోటుపాట్లను సవరించేందుకు సుప్రీంకోర్టు నడుం బిగించడంతో ఇకపై నిందితులకు ఊరట లభిస్తుందని భావించవచ్చు. మరోవైపు, ఆర్థిక చట్టాల అమలులోనూ, ఆర్థికపరమైన నేరాలను అరికట్టడంలోనూ కీలకపాత్ర వహించే ఇడి ఇకనైనా స్వతంత్రంగా వ్యవహరించవలసిన అవసరం ఉంది. పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిందనే అపప్రథను తొలగించుకోవాలంటే, ముందుగా రాజకీయ నేతల ఉచ్చులోంచి బయటపడాలి. నేతల ఒత్తిళ్ళకు లొంగకుండా పనిచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.



# హిట్లర్ ఫాసిజం, సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించింది ఎర్రజెండాలి



## ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు.

## ఈనెల 30న రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే ధర్నాలకు సైతం మద్దతు.

## సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ.

ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 9: సోవియట్ హిట్లర్ పాసిజం, సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించి రష్యాలో ఎర్రజెండా ఎగిరేసిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ప్రపంచ దేశాలను ఆక్రమించుకోవాలన్న కుట్రగా జరిగిన హిట్లర్ దూకుడుకు ఎర్రజెండా అడ్డుకట్ట వేసిందన్నారు. రష్యాలో అడుగు పెట్టకుండా సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం అడ్డుకొని కమ్యూనిస్టు నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చాయని గుర్తు చేశారు. హిట్లర్ పాసిజంపై నాటి సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం విజయం సాధించి 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. నియంత హిట్లర్ ప్రపంచంలోనే ఒక్కొక్క దేశాన్ని ఆక్రమించుకుంటూ రష్యాను కూడా ఆక్రమించుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని 1945లో సోవియట్ యూనియన్, కమ్యూనిస్టు పార్టీల ఎర్రసైన్యం అడ్డుకట్టవేసి హిట్లర్ ను ఓడిరచిందన్నారు. ఈ తరుణంలో ఫాసిజం, సామ్రాజ్యవాద ధోరణులకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు, ప్రజలు సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులు, పాలకవర్గాలు హిట్లర్ నాజీయిజాన్ని పెంచి పోషించాయని తెలిపారు. కమ్యూనిజాన్ని లేకుండా చేస్తాడని ఆయనను ప్రోత్సహించి రష్యా, సోవియట్ యూనియన్ మీద దాడి చేయించడానికి పూనుకున్నాయన్నారు. హిట్లర్ పాసిజానికి వ్యతిరేకంగా రష్యాలో స్టాలిన్ నాయకత్వాన 2 కోట్ల మంది సోవియట్ యూనియన్ ప్రజలు, సైన్యం తిరుగుబాటు చేసి ప్రాణాలర్పించారన్నారు. ఈ పోరాటంలో 30 లక్షల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రాణాలు బలి ఇచ్చారన్నారు. 20 లక్షల మంది యూదులను ఊచకోత కోశారని తెలిపారు. అయినా రష్యా ప్రజలు పోరాట శక్తిని ప్రదర్శిస్తూ హిట్లర్ ఫాసిజాన్ని ఓడించి జర్మనీలోని బెర్లిన్ నగరానికి హిట్లర్‌ను తరిమికొట్టి అక్కడ ఎర్రజెండా ఎగురవేశారని వివరించారు. ప్రపంచంలోని సంపద, వనరులను కాజేయాలన్న హిట్లర్ కుట్రలను రష్యా ప్రజలు అడ్డుకట్ట వేశారన్నారు. ఎర్రజెండాను కనుమరుగు చేయాలనుకోవడం పాలకపక్షాలు, నియంతృత్వ శక్తులతరం కాదన్నారు. ఈ తరుణంలో 8 గంటల పని విధానం కోసం ఎర్రజెండా నాయకత్వంలో ప్రజలు కొట్లాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. మళ్ళీ 12 గంటల పని విధానాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. సంఘాలు, సమ్మె హక్కులు లేకుండా చేస్తున్నారన్నారు. రైతుకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతు ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని ఉద్యమాలు కొనసాగుతుంటే పని గంటలు తగ్గించడం మోడీ ప్రభుత్వ నియంతృత విధానాలకు నిదర్శనన్నారు. నిరుద్యోగం పెరుగుతోందని, విద్యా, వైద్యం అందడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలు కావడం లేదన్నారు. ప్రపంచాన్నే గడగడలాడించిన హిట్లర్నే ఓడించిన శ్రామిక వర్గం, ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత విధానాలను సైతం ఓడిస్తారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రం అప్పులతో దివాలా తీసిందని చెప్తున్నా ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు తెలియదా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని దేవుళ్ళపై ఓట్లేసి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ వాగ్దానాలను అమలు చేయకపోతే తగిన గుణపాఠం రాష్ట్ర ప్రజలు చెప్పక తప్పదన్నారు. ఉగ్రవాద చర్యలను సీపీఐ(ఎం) ఖండిస్తుందన్నారు. ఈ తరుణంలో భారత్, పాకిస్తాన్ కు మధ్య యుద్ధం కొనసాగుతుండగా ఆర్థిక సంక్షోభ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ తరుణంలో ప్రపంచ దేశాలు సమైక్యంగా ఉగ్రవాదాన్ని అనుచివేసి శాంతిని నెలకొల్పే ప్రయత్నం చేయాలని సూచించారు.



### అందాల పోటీలు అవసరమా..

ఓవైపు భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం కొనసాగుతుండగా హైదరాబాదులో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని జాన్ వెస్లీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను దేశ ప్రజలు అసహ్యంచుకునే పరిస్థితి కల్పించొద్దని ప్రభుత్వానికి సూచించారు. వెంటనే హైదరాబాద్ లో జరగాల్సిన అందాల పోటీలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

### దేశవ్యాప్త సమ్మెకు సీపీఐ(ఎం) మద్దతు..

ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని జాన్ వెస్లీ తెలిపారు. ఈనెల 30న రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ల ముందు వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే ధర్నాలకు సైతం మద్దతు ప్రకటిస్తుందన్నారు. రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు, కార్మిక వర్గం ఈ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గాన్ని, ప్రజలను చైతన్యం చేస్తూ, శ్రామికవర్గ పోరాటాలను ముందుకుతీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, సామెల్, జగదీష్, ఈ నర్సింహ్మా, జగన్, చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు ఆలంపల్లి నర్సింహ్మా, శ్యామ్ సుందర్, కీసర నర్సిరెడ్డి, కిషన్, గోరెంకాల నర్సింహ్మా, పి జగన్, సుమలత, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ వృద్ధాశ్రమంలో ఘనంగా నీలా ఆరాధ్య జన్మదిన వేడుకలు



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 9: నీల గణేష్ ముదిరాజ్- నీల స్రవంతి ముద్దుల కూతురు నీలా ఆరాధ్య జన్మదిన వేడుకలు శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలో గల ఆదర్శ వృద్ధాశ్రమంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆరాధ్య కేక్ కట్ చేసిన అనంతరం తల్లిదండ్రులు, బంధు మిత్రులు ఆశ్రమంలోని వృద్ధులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వృద్ధులకు అన్నదాన వితరణ, పండ్లు పంపిణీ గావించారు. ఈ వేడుకలలో కాటమోని శ్రీశైలం, నీల శ్రీను, బిక్కని రాణేమ్మ, బీక్కని సాయి, పున్నారెడ్డి, శ్రీకాంత్, నక్క నరేందర్, జింకల్ల శేంకర్ తదితరులు పాల్గొన్నారు

## నాగన్ పల్లిలో ఇంటింటికి జయశంకర్ బడి -బాట





ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 9: జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగన్ పల్లిలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం తో విద్య తోనే దేశం సర్వతో ముఖాభివృద్ధి జరుగుతుందనే విద్యార్థి నినాదంలో ప్రతి ఒక్క ఇంటికి వెళ్ళి విద్యార్థుల తల్లి దండ్రులను కలిసి బడి - బాట కార్యక్రమాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు నందిత మాట్లాడుతూ జయశంకర్ బడి- బాటలో ఇంటింటి ప్రచారం అనేది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తీసుకురావడానికి, వారి తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడానికి చేపడుతున్న కార్యక్రమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో ఇంటింటికి వెళ్లి విద్యార్థులను బడికి పంపమని తల్లిదండ్రులను ప్రోత్సహించామన్నారు. బడి బాట కార్యక్రమం యొక్క లక్ష్యాలేమిటంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, పాఠశాలకు రాకుండా ఉన్న పిల్లలను గుర్తించడం, తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించడం, బాల కార్మిక నిర్మూలనకు కృషి చేయడం. ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను పాఠశాలలకు తీసుకురావడానికి తల్లిదండ్రులను ప్రోత్సహించడం. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యను వివరించడం బడిబాట లక్ష్యాలని అన్నారు. నాగన్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఉపాధ్యాయులు, కావల్సిన వసతులతో నిర్మాణం జరిగిందని, తల్లి దండ్రులకు, గ్రామ పెద్దలకు వివరించారు. ప్రధానో పాధ్యాయురాలు నందితతో పాటుగా ఉపాధ్యాయులు రవిందర్, జహంగిర్, మహేష్, రాజేష్, రాము, సరిత, మొదలైన వారు ఇందులో పాల్గోనడం జరిగింది.


## గ్రామీణ్ బంద్ ను విజయవంతం చేయాలి

పెరుమండ్ల అంజయ్య



యాచారం సూర్య న్యూస్ ( ఏప్రిల్ 09):. దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే గ్రామీణ్ బంద్ ను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పెరుమల అంజయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలో మాల్ గ్రామంలో ఉపాధి హామీ కూలీల దగ్గరికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కూలీలకు దూరం చేసే కుట్రను బిజెపి ప్రభుత్వాన్ని తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సుమారు మూడు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు డబ్బులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు చేస్తున్నారని ఆరోపించారు. పాత పద్ధతిలో గ్రూపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, ఆటో చార్జీలు ఇవ్వాలని, మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి సరియైన సైదులు పెట్టరించాలని కూలీలందరూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ, యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో చైత్రమాసం లక్ష్మీ పూజలు



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే09) : షాద్ నగర్ పట్టణంలో చైత్రమాసం పురస్కరించుకొని లక్ష్మీదేవి పూజలు అర్చనలు పి. మోహన్ రావు నిర్వహించారు. లక్ష్మీదేవిని సంపద, ఐశ్వర్యం మరియు అదృష్టానికి దేవతగా భావిస్తారు. చైత్ర మాసంలో ఆమెను పూజించడం ద్వారా, మనకు ఐశ్వర్యం మరియు సంపద లభిస్తాయని పూజారి తెలిపారు. పూజ కార్యక్రమానికి పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారు రమేష్ పాల్గొన్నారు. బండారి రమేష్, మల్లిపెద్ది శ్రీనివాసులు గుప్తా, పోల శశిధర్ ను పూజ నిర్వాహకులు మలగారి సత్యనారాయణ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్ , బండారి రమేష్, ఎంసాని శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు పెద్ది రామ్మోహన్, ఆలయ కోశాధికారి పోలశశిధర్, తాటి నారాయణమూర్తి, పి.సాగర్, కోటి లింగం గౌడ్, అశోక్, గుబ్బ శ్రీనివాస్, విజయలక్ష్మి దంపతులు, బి బాబ్జి దంపతులు, నడికూడా రఘునాథ్ యాదవ్ అనిత దంపతులు, కల్వ మురళి, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.


### లిదేవరకొండ ఏ డి ఏ శ్రీలక్ష్మి.



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 9: శుక్రవారం చింతపల్లి మండలంలోని ఎరువుల దుకాణాల డీలర్లకు చింతపల్లి రైతువేదికలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవరకొండ ఏడిఏ శ్రీ లక్ష్మి హాజరై మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందుబాటులో ఉంచాలని, అలాగే విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఎమ్మార్పీ కి మించి అధిక ధరలకు విక్రయిస్తే దుకాణా దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, దుకాణాలను సైతం సీజ్ చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు,ఎరువులు అమ్మకపు వివరాలను రికార్డుల్లో ప్రతిరోజు పొందుపరచాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి మాట్లాడతూ కాటన్ సీడ్స్ ప్యాకెట్ ఎమ్మార్పీ 901 ధరతో వ్యవసాయ అధికారి ఫోన్ నెంబర్ తో ఫ్లెక్సీ లను ప్రతి విత్తన దుకాణాల ముందు పెట్టాలని సూచించారు. రైతులకు బిల్లులు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు, విడిగా విత్తనాలు ఎవరైనా విక్రయం చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని, నకిలీ విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని లైసెన్స్ వున్న డీలర్స్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి బిల్స్ పంట కాలం పూర్తి అయ్యేవరకు జాగ్రత్త చేసుకోవాలని రైతులకు సూచించారు. దేవరకొండ ఏవో రవి కుమార్ ఫర్టిలైజర్స్, సీడ్స్ విత్తనాలు యాక్ట్ గురుంచి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మౌనిక, ప్రియాంక డీలర్లు పూల యాదయ్య,వెంకటయ్య, ప్రసాద్,శ్రీశైలం, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆ లిస్ట్ లోకి బన్నీ.. ఇప్పటికే బాలయ్య, సూర్య..



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్.. పుష్ప-2 మూవీ తర్వాత కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో వర్క్ చేస్తున్న విషయం తెలిసిందే. రీసెంట్ గా అనౌన్స్మెంట్ రాగా, ప్రస్తుతం మేకర్స్ ప్రీప్రొడక్షన్ వర్క్స్ జరుపు తున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తిగా.. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. అందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు మేకర్స్. అయితే అనౌన్స్మెంట్ నుంచే వేరే లెవెల్ లో సినిమాపై బజ్ క్రియేట్ కాగా.. మూవీ నెవ్వర్ బిఫోర్ అనేలా అట్లీ ప్లాన్ చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో క్యాస్టింగ్ ను ఫిక్స్ చేస్తున్నట్లు తెలుస్తోంది. పాన్ ఇం డియా రేంజ్ లో రానున్న ఆ మూ వీలో అల్లు అర్జున్.. హీరో, విలన్ రోల్స్ చేయబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీనిపై అధికారికంగా ఎలాంటి అనౌన్స్మెంట్ రాకపోయినప్పటికీ.. టాక్ మాత్రం నిజమేనని తెలుస్తోంది. అయితే ఇప్పటికే అల్లు అర్జున్ కన్నా ముందు కొందరు హీరోలు హీరో, విలన్ రోల్స్ ను పోషించారు. అలా రెండు క్యారెక్టర్స్ లో నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆ లిస్ట్ లో బాలకృష్ణ, సూర్య, కమల్ హాసన్ తదితరులు ఉన్నారు. సుల్తాన్ మూవీలో సూర్య, అభయ్ లో కమల్ హాసన్, రోబోలో రజినీకాంత్,
మానవుడు దానవుడులో కృష్ణ, గోట్ లో విజయ్, ఫ్యాన్ లో షారుఖ్ ఖాన్, జగన్ లో శోభన్ బాబు సహా పలువురు హీరోలు.. డబుల్ క్యారెక్టర్స్ చేశారు. హీరో అండ్ విలన్ రోల్స్ లో కనిపించారు. కానీ వారిలో అందరూ మాత్రం హిట్స్ అందు కోలేకపోయారు. ఇప్పుడు పై హీరోల లిస్ట్ లో అల్లు అర్జున్ కూడా చేరనున్నారు. అయితే విలన్ గెటప్ లో నెవ్వర్ బిఫోర్ అవతార్ లో ఆయన కనిపించనున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. అట్లీ డిజైన్ చేసిన తీరు చూస్తే ఎవరైనా షాక్ అవ్వడం గ్యారెంటీ అని టాక్ వినిపి స్తోంది. సైన్స్ ఫిక్షన్ . సైన్స్ ఫిక్షజానర్ మూవీ కనుక విలన్ రోల్ డిజైనింగ్ ఊహించని రీతిలో ఉండనుందట. ఇక మూవీ విషయానికొస్తే.. 2026లో సినిమా రిలీజ్ అవ్వ నున్నట్లు తెలుస్తోంది. ఐదు గురు హీరోయిన్స్ నటిస్తారని టాక్ విని పి స్తోంది. అందులో సమంత ఒకరని వార్తలు రాగా.. ఆమె కాదని రీసెంట్ గా క్లారిటీ వచ్చింది. రూ.500 కోట్లకు బడ్జెట్ తో సన్ పిక్చర్స్ నిర్మి స్తున్న ఆ మూ వీలో పలు వురు విదేశీ నటులు కూడా ఉ న్నారని తెలుస్తోంది. మరి బన్నీ- అట్లీ మూవీ ఎప్పుడు మొదలవు తుందో వేచి చూడాలి.

# Cinema

# దాని కోసం నాని మారుతున్నాడా?

రీసెంట్ గా హిట్3 సినిమా తో ప్రేక్షకుల ముందుకొచ్చిన నేచురల్ స్టార్ నాని, ఇప్పుడు తన తర్వాతి సినిమా కోసం పెద్ద ఎత్తున మేకోవర్ చేయడానికి రెడీ అవుతున్నాడు. హిట్3 బాక్సాఫీస్ వద్ద దాదాపు ఆఖరి స్థాయికి చేరుకుంది. యూఎస్ఎ, నైజాం లాంటి ప్రాంతాల్లో హిట్3 బ్రేక్ ఈవెన్ అయి, మంచి కలెక్షన్లు రాబట్టుకుంది.కానీ మిగిలిన ఏరియాల్లో మాత్రం హిట్3 మిక్స్ టాక్ తో నిరాశ పరిచిందనే చెప్పాలి. హిట్3 కోసం వీలైనంత కష్టపడటంతో పాటూ ఆ తర్వాత ప్రమోషన్స్ ను ఎంతో యాక్టివ్ గా నిర్వహించిన నాని, ఇప్పుడు చేసేదేమీ లేక తన తర్వాతి సినిమాపై ఫోకస్ పెట్టాడు.


ప్రస్తుతం నాని అమెరికా టూర్ లో ఉన్న విషయం తెలిసిందే.త్వరలోనే ఇండియాకు తిరిగి రానున్న నాని, వచ్చిన తర్వాత ది ప్యారడైజ్ సినిమా షూటింగ్ లో పాల్గొననున్నాడు. సికింద్రాబాద్ ప్రాంతంలో జరిగే పీరియాడికల్ డ్రామాగా ది ప్యారడైజ్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో నాని లుక్ నుంచి క్యారెక్టర్ వరకు అన్నీ చాలా కొత్తగా ఉండనున్నట్టు ఆల్రెడీ ప్యారడైజ్ నుంచి వచ్చిన రా స్టేట్మెంట్ చూస్తే అర్థమైపోతుంది. నానికి దసరా లాంటి బ్లాక్ బస్టర్ ను అందించిన శ్రీకాంత్ ఓదెల ది ప్యారడైజ్ కు దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. ఈసారి దసరాను మించిన మాస్ ఉంటుందని ఇప్పటికే నాని, శ్రీకాంత్ పలుమార్లు చెప్పగా, ఈ సినిమాలో నాని తెలంగాణ యాస మాట్లాడనున్నాడు. ప్యారడైజ్ మ్యాడ్ మ్యాక్స్ ఫిల్మ్ అని చెప్పిన నాని ఈ ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న నాని, నార్త్ లో మాత్రం ఇంకా తనదైన ముద్ర వేయలేకపోయాడు. ది ప్యారడైజ్ సినిమా తనకు పాన్ ఇండియన్ స్థాయిలో గుర్తింపు తెస్తుందని నాని నమ్ముతున్నాడు. ప్యారడైజ్ తో ఎలాగైనా దేశవ్యాప్తంగా తన ఉనికిని చాటాలని నాని టార్గెట్ గా పెట్టుకున్నాడు.






## ఫరియా రెడ్ గ్లామర్.. వ్వాటే క్యూట్ లుక్స్!

ఫరియా అబ్దుల్లా మరోసారి తన ఇన్స్టాగ్రామ్లో షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎరుపు రంగు డ్రెస్లో ఆమె ఫోజులు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా ఆమె స్టైలిష్ లుక్, వెనకకీ వదిలిన జుట్టు, ఫ్లవర్ హేర్ పిన్ స్టయిల్ ఆమెకు మరింత ప్రత్యేకత తెచ్చింది. ఒక్కో ఫొటోలో ఫరియా ఇచ్చిన హావభావాలు ఫ్యాన్స్కి కనువిందు చేస్తున్నాయి. ఫరియా కెరీర్ విషయానికొస్తే.. 'జాతిరత్నాలు' మూవీతో ఘనవిజయం అందుకున్న ఈ బ్యూటీ, ఆ తర్వాత 'మత్తు వదలరా 2', 'లైక్ షేర్ అండ్ సబ్స్క్రైబ్' వంటి సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. మొదటి సినిమాతోనే బ్లాక్బస్టర్ హిట్ అందుకున్న ఫరియా, టాలీవుడ్లో మరిన్ని అవకాశాల కోసం ఎదురుచూస్తోంది. తన సొగసు, టాలెంట్ నః రెండింటినీ సమంగా హైలెట్ చేస్తూ, గ్లామర్ పరంగా కూడా ఎక్స్ప్లోర్ అవుతోంది. ఇప్పుడు ఇన్స్టాగ్రామ్లో పెట్టిన ఈ ఫొటో షూట్ మరికొంత మంది డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ కళ్లల్లో పడేలా చేసింది. ఎరుపు రంగు గౌన్తో చేసిన ఈ బోల్డ్ ఫొటో షూట్లో ఫరియా గ్లామర్, క్యూట్నెస్ రెండింటినీ సమపాళ్లలో చూపించింది. ఫొటోలు మాత్రమే కాదు, అవి తీసిన విధానం, లైట్ ఎఫెక్ట్స్, ఫరియా ఇచ్చిన ఎక్స్ప్రెషన్స్ అన్నీ ఆన్లైన్లో మళ్లీ ట్రెండ్ అవుతున్నాయి. ఫరియా సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉండి, తరచూ ఫ్యాషన్ ఫొటోషూట్లతో పాటు వ్యక్తిగత లైఫ్కి సంబంధించిన కొన్ని ఫన్నీ అప్డేట్స్ కూడా షేర్ చేస్తూ ఉంటుంది. ఫ్యాన్స్కి క్లోజ్గా ఉండే ప్రయత్నం చేస్తూ, ఒక వెర్సటైల్ యాక్ట్రెస్గా తనను మలచుకుంటోంది. తన నెక్స్ట్ ప్రాజెక్ట్స్లో అమ్మడు ఏ విధంగా ఆకట్టుకుంటుందో చూడాలి. చివరగా మత్తు వదలరా 2సినిమాతో అమ్మడు మంచి విజయాన్ని అందుకుంది. ఇక నెక్స్ట్ ఒక తమిళ సినిమాలో కనిపించనుంది. తెలుగులో కూడా ఒక రెండు ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నట్లు టాక్.



## రంగంలోకి నాల్గవ సింగం రెడీనా!

- సింగం 4 -%కి సమయం ఆసన్నమైందా? సూర్య మళ్లీ గర్జించాల్సిన సమయమొచ్చిందా? అంటే అవుననే అనాలి. సూర్యకి కొంత కాలంగా సరైన కమర్శియల్ సక్సెస్ ఒక్కటీ లేదు. %-%కంగువ%-% తో పీరియాడిక్ ప్రయత్నం చేసి భారీ దెబ్బ తిన్నాడు. ఇటీవలే %-%రెట్రో%-% కూడా రిలీజ్ అయింది. ఓ కమర్శియల్ ఎంటర్ టైనర్ గానే రిలీజ్ అయినా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. రెగ్యులర్ సినిమాగా తేలిపోయింది. దీంతో సూర్యకి బ్యాక్ టూ బ్యాక్ ఫెయిల్యూర్స్ తప్పలేదు. ప్రస్తుతం చేస్తోన్న 45వ చిత్రం పక్కా కమర్శియల్ ఎంటర్ టైనరే. కానీ దర్శకుడు కొత్త వాడు కావడంతో ఎలా ఉంటుంది? అనే టెన్షన్ అభిమానుల్లో ఉంది. ఈ నేపథ్యంలో అభిమానులు నాల్గవ %-%సింగం%-% రంగంలోకి దిగాలంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడు తున్నారు. ఉయ్ ఆర్ వెయిటింగ్ అంటూ పోస్టులు చేస్తున్నారు. నిజానికి సింగం 4 ఇప్పటికే చేయాలి. కానీ హరితో ఎందుకనో చేతులు కలపలేదు. %-%సింగం 3%-% రిలీజ్ అయి ఇప్పటికే ఏడేళ్లు గడిచిపోయింది. అప్పటి నుంచి సూర్య-హరి వేర్వేరు చిత్రాలు చేస్తున్నారు తప్ప %-%సింగం 4%-% గురించి ఆలోచించలేదు. %-%సింగం%-- -%సింగం 2%-%కి మధ్య కేవలం రెండు..మూడేళ్లు మాత్రమే గ్యాప్ తీసుకున్నారు. కానీ నాల్గవ సింగం విషయంలోనే డిలే చేస్తున్నారు. సరైన స్టోరీ పాయింట్ దొరక్కపోవడంతోనే ఆలస్యం జరుగుతుంది. పాయింట్ కుదిరిందంటే హరి మెరుపు వేగంతో అల్లుకుపోతాడు. అతడి సినిమాల ఫార్మెట్ ఎలా ఉంటుం దన్నది చెప్పాల్సిన పనిలేదు. వన్ మ్యాన్ షోలా సాగిపోతుంది. హరి గత సినిమా రత్నం కూడా సరైన ఫలితం సాధించలేదు. ప్రస్తుతం ప్రశాంత్ హీరోగా ఓ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా తర్వాతైనా నాల్గవ సింగం పనులు మొదలు పెట్టాలని అభిమానులు కోరుతున్నారు.







## ఖిలాడీ బ్యూటీ గ్లామర్ షో

తెలుగు అమ్మాయిలు టాలీవుడ్లో హీరోయిన్స్గా రాణించడం సాధ్యం కాదని చాలా మంది అనుకుంటూ ఉంటారు. నిజంగానే తెలుగు మాట్లాడే హీరోయిన్స్ స్టార్ హీరోల సినిమాల్లో నటించడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. అయితే కొద్ది మంది అమ్మాయిలు మాత్రం ఉత్తరాది ముద్దుగుమ్మలకు ఏ మాత్రం తీసి పోకుండా అందంగా కనిపించడంతో పాటు, స్కిన్ షో చేయడం ద్వారా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కించుకుంటారు. ఏపీకి చెందిన డింపుల్ హయతి టాలీవుడ్లో పలు సినిమాల్లో నటించింది. రవితేజతో కలిసి 'ఖిలాడీ' సినిమాలో నటించడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. పలు సినిమాల్లో నటించిన డింపుల్ తమిళ్ సినిమాల్లోనూ నటించి మెప్పించేందుకు ప్రయత్నించింది. 19 ఏళ్ల వయసులోనే 'గల్ఫ్' అనే సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్లో అడుగు పెట్టింది. 2017లో విడుదల అయిన ఆ సినిమా డింపుల్కి నటిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. 2019లో ఈమె నటించిన మూడు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ముఖ్యంగా వరుణ్ తేజ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన గద్దలకొండ గణేష్ సినిమాలో చేసిన ఐటెం సాంగ్తో టాలీవుడ్లో హాట్ టాపిక్గా మారింది. జర్రా జర్రా... అంటూ సాగే ఆ పాటకు మంచి రెస్పాన్స్ దక్కింది. దాంతో డింపుల్ హయతి కెరీర్ స్పీడ్ అందుకుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్గా ఈమె అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా బ్లాక్ అండ్ వైట్ సింపుల్ అండ్ గ్లామర్ ఔట్ ఫిట్ను ధరించింది. చూపు తిప్పుకోనివ్వకుండా హొయలు పోతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. అందమైన ఈ ఖిలాడీ బ్యూటీని ఈ ఫోటోల్లో చూస్తూ ఉంటే గుండె జారి గల్లంతవుతుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో ఖిలాడీ బ్యూటీ గ్లామర్ షో చేస్తున్నా కూడా టాలీవుడ్లో ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. డీ గ్లామర్ పాత్రలతో పాటు, గ్లామర్ పాత్రలకు రెడీ అంటూ అన్ని రకాలుగా నటించేందుకు సిద్ధ పడే ఈ అమ్మడు ముందు ముందు టాలీవుడ్లో పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది.





## సూపర్ హిట్ సీక్వెల్.. ఈసారేం చేస్తారో..?



మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి లీడ్ రోల్ లో నిథిలన్ స్వామినాథన్ డైరెక్షన్ లో తెరకెక్కిన సినిమా మహారాజ. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సినిమా అది. లాస్ట్ ఇయర్ లో అటు కమర్షియల్ హిట్ గానే కాదు ప్రేక్షకుల ప్రశంసలు కూడా అదే రేంజ్ లో అందుకున్న సినిమా మహారాజ. ఈ సినిమాను దర్శకుడు తెరకెక్కించిన తీరు అందులో విజయ్ సేతుపతి యాక్టింగ్ దేనికదే ప్రత్యేకం అనిపించాయి. ఈ సినిమా తమిళ్ లోనే కాదు తెలుగులో కూడా మంచి సక్సెస్ అందుకుంది. ఐతే మహారాజ సినిమా తో సూపర్ హిట్ అందుకున్న విజయ్ సేతుపతి, నిథిలన్ కాంబో ఈ మూవీ సీక్వెల్ కి రెడీ అవుతున్నారని తెలుస్తుంది. కోలీవుడ్ మీడియా సమాచారం ప్రకారం నిథిలన్ స్వామినాథన్ మహరాజ సీక్వెల్ కథను సిద్ధం చేశాడట. ఆ కథ విజయ్ సేతుపతికి నచ్చేసిందని తెలుస్తుంది. త్వరలోనే సినిమా అనౌన్స్ మెంట్ రాబోతుందని అంటున్నారు. విజయ్ సేతుపతి కథ నమ్మి చేసిన సినిమా కాబట్టే ప్రాజెక్ట్ అంత మంచి సక్సెస్ అయ్యింది. మహారాజ సీక్వెల్ కథ ఎలా ఉంటుంది.. అందులో హీరో ఏం చేస్తాడన్నది ప్రస్తుతానికి సస్పెన్సే. ఆడియన్స్ కూడా మహారాజ లాంటి సినిమాలు చూడాలని ఆశపడుతున్నారు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాల కన్నా బెటర్ గా కథతో పాటు ఒక మంచి మెసేజ్ తో మహారాజ వచ్చింది. అంతేకాదు ఆడియన్స్ ని ఎమోషనల్ గా మెప్పించింది. అందుకే సినిమాను అంత పెద్ద హిట్ చేశారు. మహారాజ సినిమాను ఈమధ్యనే జపాన్ లో కూడా రిలీజ్ చేశారు. అక్కడ కూడా సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మహారాజ సీక్వెల్ అనగానే ఆ సినిమా లవర్స్ అంతా సూపర్ అనేస్తున్నారు. విజయ్ సేతుపతి కథల సెలక్షన్ మీద వాళ్లకి కాన్ఫిడెన్స్ ఉంది. అందుకే ఈ సినిమా కూడా తప్పకుండా సూపర్ హిట్ అవుతుందని అంటున్నారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి పూరీ జగన్నాథ్ తో బెగ్గర్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాతో పాటు ఒక వెబ్ సీరీస్ కు సైన్ చేసినట్టు తెలుస్తుంది. మహారాజ 2 సినిమా అనౌన్స్ మెంట్ తోనే సినిమాపై సూపర్ బజ్ రాబోతుందని తెలుస్తుంది. మరి ఈసారి విజయ్ సేతుపతి, నిథిలన్ స్వామినాథన్ ఏం చేస్తారో అని ఫ్యాన్స్ ఎగ్జైట్ గా ఉన్నారు.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh, epaper. www.saisuryaa.com.saisuryaadaily @gmail.com